



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 333 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం గురువారం 7 ఆగస్టు 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE :333 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM THU 7 AUGUST 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## భారత్ పై మరో 25 శాతం సుంకం విధించిన ట్రంప్

- భారత దిగుమతులపై 25% అదనపు సుంకం విధిస్తూ ట్రంప్ ఉత్తర్వు
- రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడమే కారణమని స్పష్టం చేసిన అమెరికా
- రష్యాపై ఆంక్షలను బలపరిచేందుకే ఈ చర్యలని తెలిపిన వైట్ హౌస్
- 21 రోజుల తర్వాత అమల్లోకి రానున్న కొత్త టారిఫ్‌లు
- ఇప్పటికే రవాణాలో ఉన్న సరుకులకు సెప్టెంబర్ 17 వరకు మినహాయింపు
- ఇతర దేశాలపైనా నిఘా పెట్టాలని అధికారులకు ట్రంప్ ఆదేశం




వివరాలు 2లో..

## రూ.260 కోట్ల మెగా సైబర్ స్కామ్.. ఈడీ దర్యాప్తులో బయటపడ్డ క్రిప్టో హవాలా దందా!



పెన్ పవర్ డెస్క్:ప్రపంచ వ్యాప్తంగా క్రిప్టో కరెన్సీలను అక్రమార్కులు తమ కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకుంటున్నారనే ఆందోళనలు చాలా కాలం నుంచి వినిపిస్తూనే ఉన్నాయి. అయితే తాజాగా మెగా గ్లోబల్ సైబర్ ఫ్రాడ్ కేసును చేధించే పనిలో ఈడీ నిమగ్నమైంది. ఇందులో

వివరాలు 2లో..

## 20 లక్షల ఉద్యోగాల కల్పనకు అందరం కష్టపడి పనిచేస్తున్నాం

- 'సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్ గా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై సదస్సు
- విజయవాడ నోవాటెల్ హెూటల్ లో కార్యక్రమం
- ముఖ్య అతిథిగా మంత్రి నారా లోకేశ్



పెన్ పవర్ డెస్క్:మారుతున్న కాలానికి అనుగుణంగా యువత తమ నైపుణ్యాలను మెరుగుపరుచుకోవడం ద్వారా భవిష్యత్ లో అద్భుతమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. విజయవాడ నోవాటెల్ హెూటల్ లో 'సోలార్, విండ్ ఎనర్జీ టాలెంట్ హబ్ గా ఆంధ్రప్రదేశ్' అనే అంశంపై ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ కార్పోరేషన్, స్వనీతి ఇనీషియేటివ్ సంయుక్తంగా నిర్వహించిన గ్రీన్ ఎనర్జీ కాన్ఫరెన్స్ కు మంత్రి నారా లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కాన్ఫరెన్స్ కేవలం దేశ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేయడం, సౌర,

వివరాలు 2లో..



## ఏపీలో ప్రస్తుతం అభివృద్ధి బాగుంది

### ఏపీలో అభివృద్ధిపై సినీ నటుడు సుమన్ ఆసక్తికర వ్యాఖ్యలు

- తెలుగు రాష్ట్రాలు బాగుండాలంటే ప్రభుత్వాలకు అందరూ మద్దతివ్వాలని సూచన
- తమిళనాడులో పోటీ చేయాలని తనను అడిగారని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:ఏపీ అభివృద్ధిపై సినీ నటుడు సుమన్ ఆసక్తికర వ్యా ఖ్యలు చేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో అభివృద్ధి బా గుందని ఆయన ప్రశంసించారు. తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలకు చాలా సమయం ఉందని... ఎన్నికల గురించి ఇప్పుడే ఆలోచించాల్సిన అవసరం లేదని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాలు బాగుండాలంటే ప్రభుత్వాలకు అందరూ మద్దతివ్వాలని సూచిం చారు. కొన్ని రాష్ట్రాల్లో వచ్చే ఏడాది ఎన్నికలు ఉన్నాయని... ఆ ఎన్నికల గురించి తర్వాత ఆలోచిస్తానని చెప్పారు. తాను తమిళనాడులోనే

వివరాలు 2లో..

# 'స్త్రీ శక్తి' పథకానికి ఆమోదం..

## రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

### ఏపీ క్యాబినెట్ నిర్ణయాలు...

- ఐటీ, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) ఆకర్షణకు 'లిఫ్ట్' పాలసీకి గ్రీన్ సిగ్నల్
- కొత్త బార్ పాలసీ 2025-28కి ఆమోదం.. లాటరీ పద్ధతిలో బార్ల కేటాయింపు
- మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతి.. బహిరంగ మద్యపానం నివారణే లక్ష్యం
- చేనేత, నాయీ బ్రాహ్మణులకు ఉచిత విద్యుత్ పరిమితి పెంపు.. పలు సంక్షేమ పథకాలకు ఆమోదం
- ప్రైవేట్ భాగస్వామ్యంతో ఏపీటీడీసీ హెూటళ్ల అభివృద్ధి.. 33 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు నిర్ణయం



పెన్ పవర్ డెస్క్:ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం, రాష్ట్ర భవిష్యత్ దిశను నిర్దేశించే పలు కీలక నిర్ణయాలకు వేదికైంది. ఎన్నికల హామీల అమలుతో పాటు, పారిశ్రామిక, ఐటీ రంగాల అభివృద్ధి, బలహీన వర్గాల సంక్షేమం లక్ష్యంగా మంత్రివర్గం అనేక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. వీటిలో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించే 'స్త్రీ శక్తి' పథకం, ఐటీ కంపెనీలను ఆకర్షించేందుకు ఉద్దేశించిన 'లిఫ్ట్' పాలసీ అత్యంత ముఖ్యమైనవిగా నిలిచాయి. ఈ వివరాలను మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరించారు.

**మహిళల కోసం 'స్త్రీ శక్తి'.. ఇక బస్సు ప్రయాణం ఉచితం**

రాష్ట్రంలోని మహిళలకు ప్రభుత్వం శుభవార్త అందించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు 'స్త్రీ శక్తి' పథకానికి కేబినెట్ ఆమోదం తెలిపింది. ఈ పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మహిళలు ఏపీఎస్ఆర్టీసీకి చెందిన పల్లెవెలుగు, అల్ట్రా పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. రాష్ట్రంలోని మొత్తం 11,449 బస్సుల్లో 8,456 బస్సుల్లో ఈ పథకం అమలు కానుంది. దీనివల్ల ఏటా సుమారు 1.42 కోట్ల మంది మహిళలు లబ్ధి పొందుతారని, ప్రభుత్వంపై ఏటా రూ.1,942 కోట్ల ఆర్థిక భారం పడుతుందని అంచనా వేశారు. ఈ నిర్ణయంతో ప్రతి కుటుంబానికి నెలకు రూ.800 నుంచి రూ.1000 వరకు ఆదా అవుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

**ఐటీ రంగానికి 'లిఫ్ట్'.. బడా కంపెనీలే లక్ష్యం**

రాష్ట్ర విభజన తర్వాత ఐటీ రంగంలో హైదరాబాద్‌ను కోల్పోవడంతో ఏర్పడిన లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వం నడుం బిగించింది. ఐటీ, ఐటీ ఆధారిత సేవలు (ఐటీఈఎస్), గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ)ను రాష్ట్రానికి ఆకర్షించే లక్ష్యంతో

వివరాలు 2లో..

## లిక్కర్ స్కాం సొమ్ముతో హీరోయిన్లతో కలిసి ఫ్లైట్లలో తిరిగారు

- వైసీపీ నేతలు మద్యం సొమ్ముతో రాజభోగాలు అనుభవించారన్న ఆనం
- వెంకటేశ్ నాయుడు హీరోయిన్లతో కలిసి ఫ్లైట్లలో తిరిగారని వెల్లడి
- లిక్కర్ స్కామ్‌కు విజయసాయిరెడ్డే అసలు సూత్రధారి అని స్పష్టీకరణ
- స్కామ్‌తో సంబంధమున్న నేతలతో బంధుత్వం లేదని జగన్ చెప్పగలరా? అని సవాల్



పెన్ పవర్ డెస్క్:గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీ లిక్కర్ స్కామ్ జరిగిందని, ఆ కుంభకోణం ద్వారా వచ్చిన డబ్బుతో ఆ పార్టీ నేతలు విలాస వంతమైన జీవితం గడిపారని టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. గొట్టిపాటి వెంకటేశ్ నాయుడు అనే వ్యక్తి

వివరాలు 2లో..

## రష్యా తరపున చైనా, పాక్ కిరాయి సైనికులు పోరాడుతున్నారు

- పాకిస్థాన్, చైనాలపై జెలెన్‌స్కీ సంచలన ఆరోపణలు
- వోవ్‌చాన్స్క ప్రాంతంలో పర్యటించినప్పుడు ఈ విషయం తెలిసిందన్న ఉక్రెయిన్ అధ్యక్షుడు
- తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్, ఆఫ్రికా దేశాల వారూ ఉన్నారని వెల్లడి
- కిరాయి సైనికులకు తగిన విధంగా బదులిస్తామని జెలెన్‌స్కీ హెచ్చరిక



పెన్ పవర్ డెస్క్: ఉక్రెయిన్‌పై యుద్ధంలో రష్యా తరపున చైనా, పాకిస్థాన్‌తో పాటు మరికొన్ని దేశాలకు చెందిన కిరాయి సైనికులు పోరాడుతున్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సంచలన ఆరోపణలు చేశారు. రష్యా పక్షాన పోరాడుతున్న ఈ విదేశీ కిరాయి మూకలకు తగిన విధంగా బదులిస్తామని ఆయన తీవ్రంగా హెచ్చరించారు.జెలెన్‌స్కీ కీలకమైన వోవ్‌చాన్స్క యుద్ధ క్షేత్రంలో పర్యటించి, అక్కడి సైనికులతో సమావేశమయ్యారు.

వివరాలు 2లో..

## అమిత్ షా పరువునష్టం కేసు.. రాహుల్ గాంధీకి బెయిల్ మంజూరు

- అమిత్ షాపై పరువునష్టం కేసులో రాహుల్ గాంధీకి ఊరట
- ఝార్ఖండ్‌లోని చాయ్‌బాసా కోర్టుకు హాజరైన కాంగ్రెస్ నేత
- కోర్టుకు హాజరవడంతో వెంటనే బెయిల్ మంజూరు చేసిన న్యాయస్థానం
- 2018లో రాహుల్ చేసిన వ్యాఖ్యలపై దాఖలైన కేసు
- రాహుల్ రాక సందర్భంగా చాయ్‌బాసాలో కట్టుదిట్టమైన భద్రత



వివరాలు 2లో..

## లిక్కర్ స్కామ్ నిందితుడు కసిరెడ్డికి అస్వస్థత... జైలు నుంచి ఆసుపత్రికి తరలింపు

- ఏపీ లిక్కర్ స్కామ్ లో ఏ1 నిందితుడు రాజ్ కసిరెడ్డి
- విజయవాడ జైల్లో ఉన్న కసిరెడ్డి
- కిడ్నీ స్టోన్స్ సమస్యతో బాధపడుతున్న వైనం

పెన్ పవర్ డెస్క్:ఏపీలో లిక్కర్ స్కామ్ రాజకీయ ప్రకంపనలు రేపుతున్న సంగతి తెలిసిందే. ఇప్పటికే ఈ కేసులో పలువురు అరెస్టయ్యారు. వీరిలో వైసీపీ ఎంపీ మిథున్ రెడ్డి,

వివరాలు 2లో..



## ప్రభుత్వ పథకాలపై సీఎం బొమ్మలు, పార్టీ గుర్తులు ఉండొచ్చు...

### మద్రాస్ హైకోర్టు తీర్పును కొట్టివేసిన సుప్రీంకోర్టు


- ప్రభుత్వ పథకాలకు నేతల పేర్లు, ఫోటోల వాడకంపై సుప్రీంకోర్టు కీలక తీర్పు
- మద్రాస్ హైకోర్టు ఇచ్చిన వ్యతిరేక ఉత్తర్వులను కొట్టివేసిన సర్వోన్నత న్యాయస్థానం
- ఇది దేశవ్యాప్తంగా ఉన్న విధానమేనని స్పష్టం చేసిన కోర్టు
- రాజకీయ పోరాటాలు ప్రజల్లోనే జరగాలి, కోర్టుల్లో కాదని హితవు
- పిటిషన్ వేసిన ఏఐఏడీఎంకే ఎంపీకి రూ.10 లక్షల జరిమానా
- డీఎంకే ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు.. భారీ ఊరట



పెన్ పవర్ డెస్క్:రాజకీయ యుద్ధాలు కోర్టుల్లో కాదు, ప్రజల మధ్యే జరగాలని సుప్రీంకోర్టు సం చలన వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వ సంక్షేమ

వివరాలు 2లో..

# నేను ప్రచారం చేసింది బెట్టింగ్ యాప్ కు కాదు!



పెన్ పవర్ డెస్క్:అక్రమ బెట్టింగ్ యాప్‌ల ప్రచారానికి సంబంధించిన కేసులో ప్రముఖ టాలీవుడ్ నటుడు విజయ్ దేవరకొండ బుధవారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎదుట విచారణకు హాజరయ్యారు. హైదరాబాద్‌లోని ఈడీ ప్రాంతీయ కార్యాలయంలో అధికారులు ఆయన్ను సుమారు నాలుగున్నర గంటల పాటు సుదీర్ఘంగా ప్రశ్నించారు. విచారణ అనంతరం బయటకు వచ్చిన విజయ్ దేవరకొండ మీడియాతో మాట్లాడుతూ, తాను ప్రచారం చేసింది గేమింగ్ యాప్ కోసమేనని, బెట్టింగ్ యాప్ కోసం కాదని స్పష్టం చేశారు. ఈడీ అధికారులు అడిగిన అన్ని ప్రశ్నలకు తాను సమాధానాలు ఇచ్చానని విజయ్ తెలిపారు. "గేమింగ్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌ల మధ్య చాలా తేడా ఉంది. ప్రభుత్వం గుర్తించి, లైసెన్స్ ఇచ్చిన చట్టబద్ధమైన గేమింగ్ యాప్‌ను మాత్రమే నేను ప్రమోట్ చేశాను. ఈ విషయంపై అధికారులు అడిగిన అన్ని వివరాలు, కంపెనీ, ఆర్థిక లావాదేవీల సమాచారం అందించాను.

వివరాలు 2లో..

- అక్రమ బెట్టింగ్ యాప్స్ కేసులో ఈడీ విచారణకు హాజరైన విజయ్ దేవరకొండ
- దాదాపు నాలుగున్నర గంటల పాటు ప్రశ్నించిన అధికారులు
- తాను ప్రభుత్వ అనుమతి ఉన్నవాటినే ప్రచారం చేశానని వెల్లడి
- ఇదే కేసులో ఇప్పటికే నటుడు ప్రకాశ్ రాజ్ విచారణ పూర్తి
- త్వరలో రానా, మంచు లక్ష్మి కూడా విచారణకు హాజరుకానున్న వైనం

## ఎడిటర్ వ్యూ

## యాపిల్ తింటున్నారా.. అందులో కోట్ల బ్యాక్టీరియా ఉంటుంది..!

రోజుకొక యాపిల్ తింటే ఆరోగ్యానికి మంచిది. డాక్టర్ దగ్గరికి వెళ్లాల్సిన అవసరం ఉండదని పరిశోధకులు చెప్తుంటారు. అందుకు కారణం ఫైబర్, విటమిన్స్ యాపిల్‌లో పుష్కలంగా లభించడం. కానీ, అదే పరిశోధకులు యాపిల్ గురించి షాకింగ్ విషయమొకటి వెల్లడించారు. ఒక యాపిల్ పండులో 100 మిలియన్ల(పది కోట్ల)కు పైగా బ్యాక్టీరియాలు ఉంటాయని నిర్ధారించారు. అయితే ఇవి శరీరానికి మంచి చేస్తాయా? చెడు చేస్తాయా? అనేది అవి పండించే పద్ధతిపై ఆధారపడి ఉంటుందని చెప్తున్నారు.

సాధారణంగా యాపిల్స్‌లో ఆరోగ్యానికి మేలు చేసే బ్యాక్టీరియాలు కూడా ఉంటాయి. అయితే ఆ మధ్య కొన్ని యాపిల్ రకాలపై జరిగిన పరిశోధనల్లో డేంజరస్ ఫంగీ జాతుల్ని గుర్తించారు. దీంతో ఆస్ట్రియాకు చెందిన గార్జ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ పరిశోధకులు యాపిల్‌పై పరిశోధనల్ని ముమ్మరం చేశారు. ఈ రీసెర్చిలో తేలింది ఏంటంటే.. పావు కేజీ బరువు ఉన్న ఒక యాపిల్‌లో సుమారు 10 కోట్ల బ్యాక్టీరియాలు బయటపడ్డాయి. తొక్క, విత్తనాలు, గుజ్జు.. ఇలా ప్రతీదాంట్లోనూ బ్యాక్టీరియాల జాడ ఉంది. అయితే ఆర్గానిక్ పద్ధతుల్లో పండించిన పండ్లకు, సాధారణ పద్ధతుల్లో పండించిన పండ్లకు బ్యాక్టీరియా కౌంట్ విషయంలో పెద్ద తేడాలేవి లేవట. కానీ, సేంద్రీయ పద్ధతుల్లో పండించిన పండ్లలో హానికలిగించే బ్యాక్టీరియా తక్కువగా ఉండటం ఊరట ఇచ్చే విషయమని చెప్తున్నారు.

### ఫ్రెండ్లీ బ్యాక్టీరియాలు!

సాధారణ యాపిల్ పండ్లలో ఫ్రాంటియర్స్ అనే జర్నల్ కథనం ప్రకారం'ఎశ్చరేషియా%–% షిజెల్లా' అనే హానికర బ్యాక్టీరియా ఉంటుంది. కానీ, సేంద్రియ పద్ధతుల్లో పండించిన పండ్లలో వాటి జాడే కనిపించలేదని రీసెర్చర్లు తెలిపారు. సేంద్రియ యాపిల్స్‌లో 'మిథైలోబ్యాక్టీరియమ్', 'లాక్టోబాసిల్లై' లాంటి ఫ్రెండ్లీ బ్యాక్టీరియాలు అధికంగా కనిపించాయని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన ప్రొఫెసర్ గాబ్రియెల్ బర్గ్ చెబుతోంది. అయితే యాపిల్స్‌లో మాత్రమే కాదని, దాదాపు అన్ని పండ్లు, కూరగాయల్లో బ్యాక్టీరియా, వైరస్, ఫంగీ జాతులు ఉంటాయని ఆమె అంటోంది. ఉడకబెట్టినప్పుడు, వండినప్పుడు అవి నశిస్తాయని, వాటితోపాటు ఒక్కోసారి మేలు చేసేవి కూడా అంతమవుతుంటాయని అందామె.

## 'స్త్రీ శక్తి' పథకానికి ఆమోదం..

- మొదటి పేజి తరువాయి

'ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్నికల్ టెక్ హబ్స్' (లిఫ్ట్) పాలసీకి మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పాలసీ కింద ఫార్చ్యూన్ 500, ఫోర్బ్స్ గ్లోబల్ 2000 వంటి జాబితాలలో స్థానం పొందిన బడా కంపెనీలకు పరిశ్రమల స్థాపన కోసం తక్కువ ధరకు భూములను కేటాయిస్తారు. విశాఖ, అమరావతి, తిరుపతి వంటి నగరాల్లో ఐటీకి అనువైన వాతావరణం కల్పించనున్నారు. అయితే, భూమి పొందిన కంపెనీలు కఠిన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఐటీ కంపెనీ అయితే కనీసం 3,000 ఉద్యోగాలు, జీసీసీ అయితే 2,000 ఉద్యోగాలు కల్పించాలి. ప్రతి ఎకరాకు కనీసం 500 మందికి ఉపాధి అవకాశాలు ఇవ్వాలనే షరతు విధించారు.

### కొత్త బార్ పాలసీ.. లాటరీతో కేటాయింపులు

ఆగస్టు 31తో ముగియనున్న ప్రస్తుత బార్ పాలసీ స్థానంలో 2025–28 సంవత్సరాలకు నూతన బార్ పాలసీని కేబినెట్ ఆమోదించింది. కార్టెల్ వ్యవస్థను నిరోధించేందుకు, పారదర్శకత పెంచేందుకు ఈసారి బార్లను లాటరీ పద్ధతిలో కేటాయించాలని నిర్ణయించారు. రాష్ట్రవ్యాప్తంగా 840 బార్లకు లైసెన్సులు జారీ చేయనున్నారు. గీత కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని, వారికి లైసెన్స్ ఫీజులో 50% రాయితీతో 10% రిజర్వేషన్ కల్పించారు. జనాభా ఆధారంగా మూడు కేటగిరీలుగా లైసెన్స్ ఫీజును నిర్ణయించారు. వ్యాపార సమయాన్ని ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు పొడిగించారు.

### మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడాన్ని నివారించి, శాంతిభద్రతల సమస్యలను అరికట్టే లక్ష్యంతో ప్రభుత్వం మద్యం దుకాణాల వద్ద పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇచ్చింది. రూ.5 లక్షల లైసెన్స్ ఫీజుతో, 1000 చదరపు అడుగులకు మించకుండా ఈ పర్మిట్ రూమ్‌లను ఏర్పాటు చేసుకోవచ్చు. అయితే, ఈ రూమ్‌లలో వంటగదికి అనుమతి లేదని స్పష్టం చేశారు.

## అమిత్ షా పరువునష్టం కేసు.. రాహుల్ గాంధీకి బెయిల్ మంజూరు

- మొదటి పేజి తరువాయి

కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో దాఖలైన పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి బుధవారం ఝార?ండ్‌లోని చాయ్‌బాసా ఎంపీ–ఎమ్మెల్యే కోర్టుకు ఆయన హాజరయ్యారు. రాహుల్ గాంధీ హాజరు అనంతరం న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. 2018లో చాయ్‌బాసాలో జరిగిన ఓ బహిరంగ సభలో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్ షా ప్రతిష్ఠకు భంగం కలిగించేలా రాహుల్ గాంధీ వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ప్రతాప్ కుమార్ అనే వ్యక్తి ఈ కేసు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రత్యేక న్యాయస్థానం, రాహుల్ గాంధీ వ్యక్తిగతంగా హాజరు కావాలని గతంలో ఆదేశాలు జారీ చేసింది. వాస్తవానికి జూన్ 26న హాజరు కావాల్సి ఉండగా, ఇతర కార్యక్రమాల కారణంగా తేదీని మార్చాలని రాహుల్ తరఫు న్యాయవాది ఝార?ండ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. దాంతో ఆగస్టు 6న హాజరుకావాలని హైకోర్టు స్పష్టం చేసింది. కోర్టు ఆదేశాల మేరకు రాహుల్ గాంధీ ఈరోజు విచారణకు హాజరయ్యారు. కాగా, ఝార?ండ్ మాజీ సీఎం శిబు సోరెన్ అంత్యక్రియల్లో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ ఇప్పటికే రాష్ట్రానికి వచ్చారు. అంత్యక్రియల అనంతరం ఆయన రాంచీ నుంచి హెలికాప్టర్‌లో చాయ్‌బాసాకు చేరుకున్నారు. రాహుల్ రాక నేపథ్యంలో అధికారులు టాటా కాలేజ్ గ్రౌండ్‌లో ప్రత్యేక హెలిప్యాడ్ ఏర్పాటు చేసి, కోర్టు పరిసరాల్లో భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. బెయిల్ మంజూరు కావడంతో ఈ కేసులో తదుపరి విచారణ కొనసాగనుంది.

## రష్యా తరపున చైనా, పాక్ కిరాయి సైనికులు పోరాడుతున్నారు

- మొదటి పేజి తరువాయి

ఈ పర్యటన అనంతరం జెలెన్‌స్కీ సోషల్ మీడియా వేదికగా ఈ వివరాలు వెల్లడించారు. "వోవ్‌చాన్స్క్ ప్రాంతంలో దేశాన్ని రక్షిస్తున్న మన సైనికులను కలిశాను. యుద్ధ క్షేత్రంలోని పరిస్థితులు, రక్షణ వ్యూహాలపై కమాండర్లతో చర్చించాను. ఈ సందర్భంగా, రష్యా పక్షాన చైనా, పాకిస్థాన్, తజికిస్థాన్, ఉజ్బెకిస్థాన్‌తో పాటు కొన్ని ఆఫ్రికా దేశాలకు చెందిన కిరాయి సైనికులు యుద్ధంలో పాల్గొంటున్నట్లు మా సైనికులు నివేదించారు. దీనిపై మేము తప్పకుండా స్పందిస్తాం" అని ఆయన పేర్కొన్నారు. దేశం కోసం పోరాడుతున్న సైనికులకు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు తెలిపి, వారికి ప్రభుత్వ అవార్డులను ప్రదానం చేశారు.

ఇదిలా ఉండగా, ఉక్రెయిన్ యుద్ధభూమిలో పోరు తీవ్రంగా కొనసాగుతోంది. ఆగస్టు 5న ఒక్కరోజే రష్యా, ఉక్రెయిన్ దళాల మధ్య 143 సార్లు భీకర ఘర్షణలు జరిగినట్లు ఉక్రెయిన్ సాయుధ దళాల జనరల్ తెలిపారు. ముఖ్యంగా పోక్రోవ్స్క్ సెక్టార్‌లో అత్యంత తీవ్రమైన దాడులు జరిగినట్లు ఆగస్టు 6న ఉదయం విడుదల చేసిన నివేదికలో పేర్కొంది.

గత 24 గంటల్లో రష్యా దళాలు రెండు క్షిపణి దాడులు, 107 వైమానిక దాడులు చేశాయని, ఉక్రెయిన్ సైనిక స్థావరాలు, జనావాసాలపై 147 గైడెడ్ బాంబులను ప్రయోగించాయని ఆ నివేదిక వివరించింది. రష్యా దాడులకు ప్రతిగా, తమ వైమానిక, క్షిపణి దళాలు రష్యాకు చెందిన 14 లక్ష్యాలను ధ్వంసం చేశాయని ఉక్రెయిన్ సైన్యం తెలిపింది. వీటిలో శత్రువుల కమాండ్ పోస్టులు, సైనిక స్థావరాలు, ఆయుధాగారాలు ఉన్నట్లు స్పష్టం చేసింది.

# రూ.260 కోట్ల మెగా సైబర్ స్కామ్.. ఈడీ దర్యాప్తులో బయటపడ్డ క్రిప్టో హవాలా దందా!

- మొదటి పేజి తరువాయి

భాగంగా దాదాపు 11 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు అధికారులు. ఢిల్లీ, నోయిడా, గురుగ్రాము, డెహ్రాడూన్ ప్రాంతాల్లో రూ.260 కోట్ల స్కామ్ కి సంబంధించిన రైడ్స్ చేపట్టింది. నేరగాళ్లు ప్రజల నుంచి డబ్బు కాజేయటానికి పోలీసు అధికారులమని, ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్ల మంటూ బెదిరింపులకు పాల్పడి వారి నుంచి డబ్బు కాజేసినట్లు సీబీఐ, ఢిల్లీ పోలీసులు కేసులు నమోదు చేశారు. దీనిపై రంగంలోకి దిగిన ఈడీ నిందితులు ఈ డబ్బును అక్రమంగా విదేశాలకు హవాలా రూపంలో క్రిప్టో కరెన్సీ రూపంలో తరలించటం ద్వారా మనీలాండరింగ్ జరిగినట్లు ప్రాథమికంగా గుర్తించింది. కొన్ని కేసుల్లో నేరగాళ్లు తాము మైక్రోసాఫ్ట్, అమెజాన్ టెక్ ప్రతినిధులమని సహాయం చేసేందుకు కాల్ చేసినట్లు నమ్మబలికి వారి నుంచి డబ్బు కాజేసినట్లు పోలీసులకు తెలిసింది. సైబర్ నేరగాళ్లు తాము చేపట్టిన నేరాల నుంచి వచ్చిన డబ్బును క్రిప్టోలుగా మార్చి అనేక వాలెట్లలోకి పంపినట్లు గుర్తించారు అధికారులు. బిట్ కాయిన్ల రూపంలో వాటిని స్టోర్ చేసి ఆ తర్వాత వాటిని క్రిప్టో కరెన్సీల్లో టెథర్ అనే స్టేబుల్ కాయిన్ గా మార్చారు. అక్కడి నుంచి హవాలా మార్గంలో యూఏఈలోని ఆపరేటర్ల ద్వారా క్యాష్ గా మార్చుకున్నట్లు దర్యాప్తులో తేలింది.

## 20 లక్షల ఉద్యోగాల కల్పనకు అందరం కష్టపడి పనిచేస్తున్నాం

- మొదటి పేజి తరువాయి

పవన శక్తికి నైపుణ్య హబ్ గా ఏపీని తీర్చిదిద్దడమే కాదు.. ప్రపంచ గ్రీన్ ఎనర్జీ భవిష్యత్ ను శక్తివంతం చేసే దిశగా ఈ కాన్ఫరెన్స్ ను నిర్వహించడం జరుగుతోంది. తద్వారా మన యువతకు ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి అని వెల్లడించారు.

### దేశంలో ఏ పార్టీకి ఈ రికార్డు లేదు!

దేశంలో ఏ పార్టీ సాధించని విధంగా కూటమి ప్రభుత్వం 94 శాతం స్ట్రైక్ రేట్ తో 164 సీట్లను కైవసం చేసుకోవడం జరిగింది. కూటమి ప్రభుత్వంలో ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చాం. ఇందుకోసం అందరం కష్టపడి పనిచేస్తున్నాం. ఒకే రాష్ట్రం–ఒకే రాజధాని, అభివృద్ధి వికేంద్రీకరణ మా నినాదం. క్లస్టర్ విధానంలో పెట్టుబడులను ఆకర్షిస్తాం. ఇందుకు కావాల్సిన ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేస్తాం. అనంతలో ఆటోమొబైల్, కర్నూలు రెన్యువబుల్ ఎనర్జీ, కడప, చిత్తూరును ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్ గా, నెల్లూరులో ఎయిర్ కండిషనర్స్ వంటి స్పెషలైజ్డ్ మ్యానుఫ్యాక్చరింగ్, ప్రకాశం జిల్లాను సీబీజీ హబ్ గా, గుంటూరు, కృష్ణాను క్యాంటమ్ వ్యాలీ హబ్ గా, తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాలను ఆక్వా హబ్ గా, ఉత్తరాంధ్రను ఫార్మా, డేటా సెంటర్, ఐటీ హబ్ గా, మెడికల్ డివైస్ మాన్యుఫ్యాక్చరింగ్ హబ్ గా తయారు చేస్తాం. ప్రతి వంద కిలోమీటర్లకు ఓ క్లస్టర్ ఏర్పాటుచేసి ఆయా రంగాల్లో టాప్ 20 కంపెనీలను తీసుకువచ్చేందుకు కృషిచేస్తున్నాం. దీంతో పాటు నైపుణ్యం పెంపు, నవీన ఆవిష్కరణలకు ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది.

### సెప్టెంబర్ 1వ తేదీన నైపుణ్యం పోర్టల్ ను ప్రారంభిస్తాం

రెన్యువబుల్ ఎనర్జీ రంగంలో రాష్ట్రానికి అనేక పరిశ్రమలు వస్తున్నాయి. ప్రైవేటు సెక్టార్ తో నైపుణ్యం గల యువతను అనుసంధానించాల్సిన అవసరం ఉంది. సెప్టెంబర్ 1న నైపుణ్యం పోర్టల్ ను ప్రారంభించడం జరుగుతోంది. స్కిల్ డెవలప్ మెంట్ కార్పొరేషన్, సీడాప్ ద్వారా యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తాం. ప్రపంచ అవసరాలకు అనుగుణంగా అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది. పునరుత్పాదక ఇంధన రంగంలో ప్రపంచవ్యాప్తంగా అనేక అవకాశాలు ఉన్నాయి. ఇందుకోసం రాష్ట్రం చొరవ తీసుకుని యువతకు అవసరమైన నైపుణ్య శిక్షణ అందిస్తాం. అవకాశాలను అందిపుచ్చుకునేలా యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది. నా ఛాలెంజ్ ను స్వీకరించి సుజ్లాన్ సంస్థ ఇప్పటికే 2 నైపుణ్య శిక్షణా కేంద్రాలను నిర్మించింది. అవి ఇప్పటికే పనిచేస్తున్నాయి.

### గ్రీన్ ఎనర్జీ రంగం ద్వారా యువతకు విస్తృత అవకాశాలు

గ్రీన్ ఎనర్జీ రంగం ద్వారా మహిళలకు వారి గ్రామాల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. యువగళం పాదయాత్ర సమయంలో అనంత జిల్లాలోని కియా యాన్సిలరీ యూనిట్స్ లో మహిళలు పనిచేయడం చూశాను. ఓ మహిళ నా వద్దకు వచ్చి నాతో పాటు నడిచారు. ఏం చేస్తున్నారని ఆ మహిళను ప్రశ్నించగా.. తాను కియా యాన్సిలరీ యూనిట్స్ లో పనిచేస్తున్నానని, గతంలో సాధారణ గృహిణిగా ఉన్న తాను ఇప్పుడు నెలకు రూ.40 వేలు సంపాదిస్తూ కుటుంబానికి అండగా నిలిచానని గర్వంగా చెప్పారు. ఇప్పుడు కుటుంబంలో తనకు ఎంతో గౌరవం దక్కుతోందని చెప్పారు. ఒక్క కియా పరిశ్రమ వల్ల అనంతపురం జిల్లాలో వచ్చిన మార్పు ఇది.

గ్రీన్ ఎనర్జీ రంగంలో కూడా విస్తృత అవకాశాలు ఉన్నాయి. అందుకే విండ్, సోలార్, రెన్యువబుల్, పంప్డ్ స్టోరేజీ, సీబీజీ ప్రాజెక్టులపై ప్రధానంగా దృష్టిసారించాం. 20 లక్షల ఉద్యోగాల కల్పనపై గౌరవ సీఎం చంద్రబాబు గారు చాలా పట్టుదలతో ఉన్నారు. దీనిని చాలా ప్రాముఖ్యతగా తీసుకున్నాం. ఇందుకోసం ప్రైవేటు సెక్టార్ తో కలిసి పనిచేస్తాం. ఓంక్యాప్ ద్వారా యువతకు విదేశాల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం... అని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఏపీఎస్ఎస్ డిసి ఛైర్మెన్ బూరుగుపల్లి శేషారావు, ఎన్ఆర్ఈడీసీఏపీ వైస్ ఛైర్మెన్ కమలాకర్ బాబు, స్వనీతి ఇనీషియేటివ్ సీఈఓ రీత్వికా భట్టాచార్య పాల్గొన్నారు.

## లిక్కర్ స్కామ్ నిందితుడు కసిరెడ్డికి అస్వస్థత... జైలు నుంచి ఆసుపత్రికి తరలింపు

- మొదటి పేజి తరువాయి

వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి తదితరులు కూడా ఉన్నారు. అరెస్టయిన వారందరూ ప్రస్తుతం రిమాండ్ లో ఉన్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన రాజ్ కసిరెడ్డి (ఏ1) విజయవాడ జైల్లో ఉన్నారు. ఆయన ఈరోజు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయనను చికిత్స నిమిత్తం జైలు నుంచి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆయన కిడ్నీలో స్టోన్స్ సమస్యతో బాధపడుతున్నట్టు వైద్యులు తెలిపారు.

## నేను ప్రచారం చేసింది బెట్టింగ్ యాప్ కు కాదు!

- మొదటి పేజి తరువాయి

నా వివరణతో వారు సంతృప్తి చెందారు" అని ఆయన అన్నారు. తాను ప్రచారం చేసిన %ూ%23 యాప్ కొన్నిచోట్ల ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించగా, "చట్టబద్ధమైన యాప్‌లకు జియో–లోకేషన్ లాక్ ఉంటుంది. తెలంగాణలో దాన్ని తెరవాలని ప్రయత్నిస్తే, ఈ ప్రాంతంలో అనుమతి లేదని సందేశం వస్తుంది. ఏ రాష్ట్రాల్లో అనుమతి ఉందో అక్కడే ఆ యాప్ పనిచేస్తుంది" అని విజయ్ వివరించారు. ఏది తప్పు, ఏది ఒప్పు అనేది ప్రభుత్వాలు, కోర్టులు నిర్ణయిస్తాయని ఆయన పేర్కొన్నారు. ఈ కేసులో ఈడీ విచారణ ఎదుర్కొన్న రెండో నటుడు విజయ్ దేవరకొండ. గత నెల 30న నటుడు ప్రకాశ్ రాజ్‌ను అధికారులు ఐదు గంటల పాటు విచారించారు. అయితే, తాను ఒక గేమింగ్ యాప్ కోసం ప్రకటన చేసినప్పటికీ, మనస్సాక్షి అంగీకరించకపోవడంతో ఎలాంటి పారితోషికం తీసుకోలేదని ప్రకాశ్ రాజ్ అధికారులకు తెలిపినట్లు సమాచారం.

ఈ కేసులో భాగంగా ఈడీ మొత్తం 29 మంది సినీ ప్రముఖులు, ఇన్ఫ్లుయెన్సర్లపై కేసు నమోదు చేసింది. వీరిలో రానా దగ్గుబాటి, మంచు లక్ష్మికి కూడా నోటీసులు జారీ చేసింది. రానా ఆగస్టు 11న, మంచు లక్ష్మి ఆగస్టు 13న విచారణకు హాజరుకావాల్సి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో నమోదైన పలు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద ఈడీ ఈ దర్యాప్తు చేపట్టింది.

## ప్రభుత్వ పథకాలపై సీఎం బొమ్మలు, పార్టీ గుర్తులు ఉండొచ్చు...

- మొదటి పేజి తరువాయి

పథకాలకు జీవించి ఉన్న రాజకీయ నాయకులు, మాజీ ముఖ్యమంత్రులు లేదా పార్టీల సైద్ధాంతిక నాయకుల పేర్లు, ఫోటోలు, చిహ్నాలు వాడరాదంటూ మద్రాస్ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సర్వోన్నత న్యాయస్థానం బుధవారం కొట్టివేసింది. ఈ తీర్పుతో తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వానికి భారీ ఊరట లభించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ కేసును విచారించింది. తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను అనుమతించింది. మద్రాస్ హైకోర్టులో ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేసిన ఏఐఏడీఎంకే ఎంపీ సి.వి. షణ్ముగంపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఆయన పిటిషన్‌ను కొట్టివేయడమే కాకుండా, రూ. 10 లక్షల జరిమానా విధించింది. రాజకీయ నాయకుల పేర్లతో పథకాలు ప్రవేశపెట్టడం దేశవ్యాప్తంగా సర్వసాధారణంగా జరుగుతున్న విషయమని ధర్మాసనం అభిప్రాయపడింది. "అన్ని రాజకీయ పార్టీల నాయకుల పేర్లతో పథకాలు అమలులో ఉన్నప్పుడు, పిటిషనర్ కేవలం ఒకే పార్టీని, ఒకే నాయకుడిని లక్ష్యంగా చేసుకోవడం వెనుక ఉద్దేశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రజాధనం దుర్వినియోగంపై నిజంగా ఆందోళన ఉంటే, అన్ని పథకాలపైనా పిటిషన్ వేయాల్సింది" అని కోర్టు పేర్కొంది. షణ్ముగం దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) చట్ట ప్రకారం చెల్లదని, ఇది న్యాయ ప్రక్రియను దుర్వినియోగం చేయడమేనని ధర్మాసనం స్పష్టం చేసింది.

ముఖ్యమంత్రి స్టాలిన్ పేరుతో ఉన్న 'ఉంగళుదన్ స్టాలిన్' (మీ స్టాలిన్) పథకాన్ని సవాల్ చేస్తూ ఏఐఏడీఎంకే ఎంపీ షణ్ముగం మొదట కేంద్ర న్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కేవలం మూడు రోజులకే మద్రాస్ హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన మద్రాస్ హైకోర్టు, జూలై 31న ప్రభుత్వ పథకాలకు రాజకీయ నాయకుల పేర్లు, ఫోటోలు వాడరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను డీఎంకే ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేయగా, తాజాగా అనుకూల తీర్పు వెలువడింది.

## లిక్కర్ స్కాం సొమ్ముతో హీరోయిన్లతో కలిసి ఫ్లైట్లలో తిరిగారు

- మొదటి పేజి తరువాయి

స్కామ్ సొమ్ముతో హీరోయిన్లతో కలిసి ప్రత్యేక విమానాల్లో జల్సాలు చేశారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వైసీపీ నేతలపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ, లిక్కర్ స్కామ్‌లో కీలక పాత్ర పోషించిన వ్యక్తులంతా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి బంధువులు, సన్నిహితులేనని ఆరోపించారు. "రాజకాశిరెడ్డి ఎవరో తెలియదని, ఆయన వైఎస్ సుజాతారెడ్డికి అల్లుడు కాదని జగన్ చెప్పగలరా? రాజకాశిరెడ్డి, ముప్పిడి అవినాష్ రెడ్డి బంధువులు కాదా? చంద్రగిరికి చెందిన చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మిథున్ రెడ్డి వంటి వారితో తమకు ఎలాంటి సంబంధం లేదని జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించే ధైర్యం ఉందా?" అని ఆనం సవాల్ విసిరారు. వైసీపీ నేతలను ఈ విషయంపై ప్రశ్నిస్తే, తమకు ఏమీ తెలియదని, స్కామే జరగలేదని చెప్పడం వారి ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

ఈ మొత్తం లిక్కర్ స్కామ్‌కు సూత్రధారి, కింగ్‌పిన్ వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డేనని ఆనం వెంకటరమణారెడ్డి ఆరోపించారు. జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన విజయసాయిరెడ్డే ఈ వ్యవహారాన్ని ముందుండి నడిపించారని అన్నారు. "ఆ పొట్టోడిని నమ్మొద్దని, నమ్మితే సంకనాకిపోతారని నేను ముందే చెప్పాను" అంటూ తన పాత వ్యాఖ్యలను గుర్తుచేశారు. ఇటీవల విజయసాయిరెడ్డి మాట్లాడుతూ, "లిక్కర్ స్కామ్ జరిగింది కానీ, తనకు సంబంధం లేదు" అని చెప్పడాన్ని ఆనం ప్రస్తావించారు. పార్టీలో కీలక నేతగా, వైజాగ్ ఇన్‌ఛార్జ్‌గా పనిచేసిన వ్యక్తి అలా చెప్పడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. విజయసాయిరెడ్డి స్కామ్ జరిగిందని ఒప్పుకున్నారంటే, వైసీపీ ప్రభుత్వంలోని ప్రతి నాయకుడికీ అందులో భాగం ఉన్నట్లేనని ఆయన స్పష్టం చేశారు. తమ ప్రభుత్వంలో తప్పు చేస్తే దండించడానికి చంద్రబాబు నాయుడు అనే హెడ్ మాస్టర్ బెత్తం పట్టుకుని ఉంటారని, అందుకే తాము తప్పులు చేయలేమని ఆనం అన్నారు. కానీ, వైసీపీ నేతలు మాత్రం ప్రజల సొమ్ముతో రాజభోగాలు అనుభవించారని మండిపడ్డారు. ప్రజలు ఎన్నికల్లో తిరస్కరించినా వైసీపీ నేతలు ఇంకా అబద్ధాలు చెబుతున్నారని, మాట్లాడే ముందు ఒక్కసారి మనస్సాక్షిని ప్రశ్నించుకోవాలని హితవు పలికారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రిగా ఉన్నందున ఈ ఆరోపణలన్నింటికీ జగన్‌మోహన్‌రెడ్డి సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందని ఆనం వెంకటరమణారెడ్డి డిమాండ్ చేశారు.

## ఏపీలో ప్రస్తుతం అభివృద్ధి బాగుంది

- మొదటి పేజి తరువాయి


పుట్టి పెరిగానని... అందుకు తనను అక్కడ పోటీ చేయమని అడిగారని... అయితే, తర్వాత చెబుతానని తాను వారికి చెప్పానని తెలిపారు. సుమన్ ఈరోజు గుంటూరులో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పైవ్యాఖ్యలు చేశారు.

## భారత్ పై మరో 25 శాతం సుంకం విధించిన ట్రంప్

- మొదటి పేజి తరువాయి

రష్యా నుంచి చమురు కొనుగోలును కొనసాగిస్తున్న భారత్‌పై అమెరికా కఠిన వైఖరి అవలంబించింది. భారతదేశం నుంచి వచ్చే దిగుమతులపై అదనంగా 25 శాతం టారిఫ్ (సుంకం) విధిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం ఒక కార్యనిర్వాహక ఉత్తర్వుపై (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్) సంతకం చేశారు. గత వారం ప్రకటించిన 25 శాతం సుంకానికి ఇది అదనం కావడం గమనార్హం. ఉక్రెయిన్‌పై సైనిక చర్య నేపథ్యంలో రష్యాపై విధించిన ఆంక్షలను మరింత బలోపేతం చేసేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వైట్ హౌస్ ఒక ప్రకటనలో వెల్లడించింది. భారతదేశం ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రష్యా నుంచి చమురును దిగుమతి చేసుకోవడం తమ జాతీయ భద్రతకు, విదేశాంగ విధానానికి ముప్పుగా పరిగణిస్తున్నట్లు అమెరికా పేర్కొంది. "అందువల్ల, వర్తించే చట్టాలకు అనుగుణంగా, యునైటెడ్ స్టేట్స్ కస్టమ్స్ భూభాగంలోకి దిగుమతి అయ్యే భారతీయ వస్తువులపై 25 శాతం అదనపు సుంకం విధించబడుతుంది" అని ఉత్తర్వులో స్పష్టం చేశారు. ఈ కొత్త సుంకాలు ఉత్తర్వుపై సంతకం చేసిన 21 రోజుల తర్వాత అమెరికాలోకి ప్రవేశించే అన్ని అర్హత కలిగిన భారతీయ వస్తువులపై అమల్లోకి వస్తాయి. అయితే, ఈ గడువుకు ముందే రవాణాలో ఉండి, సెప్టెంబర్ 17వ తేదీలోపు కస్టమ్స్ క్లియరెన్స్ పొందే సరుకులకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు కల్పించారు. ఇప్పటికే ఉన్న సుంకాలను యథాతథంగా కొనసాగిస్తూ, ఈ కొత్త టారిఫ్‌లను అదనంగా విధించనున్నారు. ఈ ఉత్తర్వులకు లోబడి ఉన్న వస్తువులు కఠినమైన కస్టమ్స్ నిబంధనలను పాటించాల్సి ఉంటుంది. వాటిని అమెరికాలోని విదేశీ వాణిజ్య జోన్లలో 'ప్రివిలేజ్డ్ ఫారిన్ స్టేటస్' కింద మాత్రమే అనుమతిస్తారు. మారుతున్న పరిస్థితులు, ప్రభావిత దేశాల ప్రతిచర్యలు లేదా రష్యా, భారత్ విధానాలలో గణనీయమైన మార్పుల ఆధారంగా ఈ ఉత్తర్వును సవరించే అధికారాన్ని ట్రంప్ తన వద్దే ఉంచుకున్నారు. ఇదే సమయంలో, రష్యాతో ఇతర దేశాల చమురు వాణిజ్యాన్ని నిశితంగా గమనించాలని, అవసరమైతే ఇలాంటి చర్యలనే సిఫారసు చేయాలని వాణిజ్యం, విదేశాంగ, ట్రెజరీ వంటి కీలక విభాగాలను ట్రంప్ ఆదేశించారు.

## శ్రీ వేణుగోపాలస్వామివారి తెప్పోత్సవాలు ప్రారంభం





**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 6 :** కార్వేటినగరం రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామివారి తెప్పోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం జరిగింది. ఇందులో పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనంలతో అభిషేకం చేశారు. అనంతరం సాయంత్రం 5 నుండి 6.30 గంటల వరకు తిరువీధి ఉత్సవం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీ సీతాలక్ష్మణ సమేత శ్రీ కోదండరామస్వామివారు తెప్పలపై విహరించి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ మూడు రోజుల పాటు జరగనున్న తెప్పోత్సవాలలో భాగంగా తెప్పపై స్వామి వారు విహరించనున్నారు. ఈ సందర్భంగా హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహించారు.

పెన్ పవర్
వై.ఎస్.ఆర్. కడప
అన్నమయ్య జిల్లా

# రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం

## అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**వైయస్సార్ కడప పెన్ పవర్ ఆగస్టు 6 :** రోడ్డు భద్రత చర్యల ఆంక్షలను జిల్లాలో మరింత కఠినతరం చేసి..రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని బోర్డు రూమ్ హాలులో.. జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో జిల్లా రహదారుల భద్రతా సమన్వయ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ డా. శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్న రహదారులపై ఎన్ఫోర్స్మెంట్ చర్యలను కఠినతరం చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రధాన రహదారుల్లో డివైడర్లను బ్రేక్ చేసి.. వాహన ప్రమాదాలకు అవకాశం కల్పిస్తున్న వారిపై చట్టపరమైన కేసులు నమోదు చేయాలన్నారు. రియల్టర్లు, రాజకీయ ప్రమేయాలకు స్పందించకుండా రోడ్డు భద్రతా ఆంక్షలను పాటించాలన్నారు. ఎన్ఫోర్స్ మెంట్ అధికారుల నిర్లక్ష్యం వల్ల ఎక్కడయినా ప్రమాదాలు సంభవించ కుండా చూడాలన్నారు. ఇంజనీరింగ్ శాఖల వారీగా వారి సంభందిత రహదారులపై తాజాగా జరిగిన ప్రమాదాలను విశ్లేషించి, వాటి నివారణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. రోడ్డు ప్రమాదాలు జరిగిన సమయాల్లో.. 108 వాహన సేవలు సకాలంలో అందేలా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యా సంస్థల వద్ద స్పీడ్ బ్రేకర్స్ ఏర్పాటు, అలాగే ప్రతి పెట్రోల్ బ్యాంకులు, కమర్షియల్ కాంప్లెక్స్ ల వద్ద సిసి కెమేరాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. మలుపుల వద్ద బ్యారికెడ్, స్టాపర్స్, ప్రమాద సంకేత సూచికలను పొందుపరచాలన్నారు. జాతీయ రహదారుల్లో రోడ్డు సేఫ్టీ కన్సల్టెంట్ ను నియమించుకుని రోడ్డు ప్రమాదాల పై అనాలిసిస్ చేసి ప్రమాదాలను అరికట్టాలన్నారు.అలాగే స్పీడ్ లిమిట్ డిస్ప్లే బోర్డ్స్ లను ఏర్పాటు చేయాలని నేషనల్ హైవే అథారిటీ అధికారులను ఆదేశించారు. అతివేగం, డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్,సీట్ బెల్ట్ లేకుండా వాహనం నడపడం, పరిమితికి మించి ఆటోలు నడపడం, బస్సులు ఇతర వాహనాలలో అధిక లోడుతో సరుకు, ఇతర సామగ్రి రవాణా చేసే వారిపై.. కఠిన చర్యలు తీసుకోవలసిందిగా రవాణ శాఖ అధికారులను ఆదేశించారు. ట్రాన్స్ పోర్ట్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో అంతర్ జిల్లా సరిహద్దుల చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలన్నారు. గువ్వల చెరువు ఘాట్ రోడ్డు ప్రమాదాలపై టోల్ గేట్ ల వద్ద పాంప్లేట్ ముద్రించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గువ్వల చెరువు ఘాట్ దిగే మలుపు వద్ద రోడ్డును విస్తరించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి కేసులు ఫైల్ చేయాలన్నారు. పట్టణ ప్రాంతాల్లో కమర్షియల్, అధిక జన సంచార ప్రాంతాల్లో రోడ్డు భద్రతా చర్యల్లో ఆయా మున్సిపల్ కమిషనర్ల భాగస్వామ్యం కావాలన్నారు. ప్రజల ప్రాణ భద్రత కోసం రూల్స్ అతిక్రమించే వారిపై ఫైన్లు, కేసులు నమోదు చేయాలన్నారు. అన్ని విద్యా సంస్థల్లో రహదారుల భద్రతకు అవసరమైన నియంత్రణ చర్యలు, అత్యవసర సహాయక చర్యలు, నియమ నిబంధనలు మొదలైన వాటిపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, కమిటీ సభ్యులైన రోడ్ సేఫ్టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు జి.వి రమణ, , వైద్య ఆరోగ్యశాఖ, ఆర్ అండ్ బి శాఖ అధికారులు, విద్యుత్ శాఖల ఎస్.ఈ.లు, మున్సిపల్ కమిషనర్లు, నేషనల్ హైవేస్ అథారిటీ అధికారులు, ట్రాఫిక్, పోలీసు, రవాణా శాఖ అధికారులు,కమీటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.



## పౌరులకు నాణ్యమైన పౌర సేవలు అందించాలి

### – జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్



**చిత్తూరు, పెన్ పవర్ ఆగస్టు 6 :** ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రతి అర్జీని నిర్ణీత గడువులోగా రీ ఓపెన్ కి ఆస్కారం లేకుండా నాణ్యతతో పరిష్కారం చూపేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా అధికారులతో ప్రత్యక్షంగా, రెవెన్యూ డివిజన్, అధికారులు, మునిసిపల్ కమీషనర్లు, తాహసిల్దార్లు, మండల తదితర అధికారులతో వర్చువల్గా ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీలు పరిష్కారంపై జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, డిఆర్ఓ మోహన్ కుమార్ తో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రైనింగ్ కలెక్టర్ నరేంద్ర పాడెల్, డీఎఫ్ఓ ధరణి తదితరులు పాల్గొన్నారు. ఈ సంధర్బంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మ కంగా అమలు చేస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. లో వచ్చిన అర్జీలను నాణ్యతతో గడువులోగా పరిష్కారం చూపాలని, ఎలాంటి అలసత్వం ఉండరాదని తెలిపారు. పరిష్కారం చూపలేని అర్జీదారునికి స్పష్టంగా ఎండార్స్మెంట్ చేసి తెలపాలని ఆదేశించారు. రీ ఓపెన్ కి తావు లేకుండా పరిష్కారం చూపాలని అన్నారు. అర్జీదారులు వారి సమస్యల పరిష్కారం కొరకు పీజీఆర్ఎస్ కు రావడం జరుగుతుందని సంబంధిత అధికారులు అర్జీ దారునితో స్వయంగా మాట్లాడి వారి సమస్యలను సావధానంగా విని సంతృప్త స్థాయిలో పరిష్కారం చూపాలన్నారు.

అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎకు వెళ్లకుండా రోజువారీగా అర్జీలను ఓపెన్ చేసి చూసుకుని పరిష్కార దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ కు వచ్చిన అర్జీలకు పరిష్కారంచూపకుండా నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని సంబంధిత శాఖాధికారులను కలెక్టర్ హెచ్చరించారు. జి ఆర్ ఎ స్వయంగా ఎండార్స్మెంట్ చేసి ఇవ్వాలి. ప్రభుత్వం ఏర్పాటు నుండి 15.6.24 నుండి 6.8.25 తేదీ వరకు 59500 వినతల స్వీకరించడం జరిగిందని తెలిపారు. కోర్టు కేసులకు వెంటనే కౌంటర్ ఫైల్ దాఖలు చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు, రెవెన్యూ, రీ సర్వే, పోలీసు శాఖలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు అధిక సంఖ్యలోవినతలు అందజేశా రని తెలిపారు, మండలాల ప్రత్యేకఅధికారులు, క్షేత్రస్థాయిలో పర్యటించి, మండలాల్లో అంగన్వాడి కేంద్రాలు,ప్రభుత్వాసుపత్రులు, పాఠశాలలు, వివిధ సంక్షేమ వసతి గృహాలు తనిఖీలు చేసి సమస్యలను గుర్తించాలని తెలిపారు. అలాగే వివిధ అభివృద్ధి పనులు ఎలా ఉన్నాయో పరిశీలించినివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. చదువుకొని ప్రతి విద్యార్థికి ప్రభుత్వం ఉచితంగా 5000 రూపాయలు ఖర్చు చేస్తుందని తెలిపారు, మండ లాల విద్యాశాఖ అధికారులు, ఆయా పాఠశాలల్లో మధ్యాహ్నం భోజనం ఎలా అమలు చేస్తున్నారు పరిశీలించాలని తెలిపారు, జిల్లాలోని అన్ని శాఖలు హెచ్వోడీలు కచ్చితంగా ఉత్తర ప్రత్యుత్తల కొరకు కార్యాలయాలలో ఈ ఆఫీస్ ద్వారా ఫైల్ నిర్వహించాలని ఆదేశించారుప్రతికార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ ఫైల్ ఎన్ని పరిష్కరించాడు ఎన్ని ఫైల్ పెండింగ్ లో ఉన్నాయో, సీనియర్ అసిస్టెంట్ దగ్గర ఫైల్స్ ఎన్ని ఉన్నాయి, పెండింగ్ ఫైల్స్ ఎన్ని ఉన్నాయి తపాలా బట్వాడాఎలానిర్వహించారు. ప్రొఫార్మాలో నాకు నివేదికలు ఆయా శాఖలు హెచ్వోడీలు అందజేయాలని ఆదేశించారు. కార్యాలయాలను హెచ్ ఓడిలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశించారు, మీ శాఖల పైన మీకు మంచి పట్టు ఉండాలని ఆదేశించారు, ప్రతి బుధవారంపై కార్యక్రమంపై ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు, ప్రజలు ప్రభుత్వ కార్యాలయానికి వచ్చినప్పుడు సంబంధిత అధికారులు అర్జీదారని సమస్యను ఓపిగవిని సమస్యను పరిష్కరించే దిశగా కృషి చేయాలని తెలిపారు కార్యక్రమంలో జిల్లాలోని అన్ని శాఖల హెచ్ఓడిలు తదితరులు పాల్గొన్నారు.

## నారాయణగిరి శ్రీవారి పాదాల చెంత వేడుకగా ఛత్రస్థాపనోత్సవం



**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 6 :** తిరుమలలోని నారాయణగిరి శ్రీవారి పాదాల చెంత బుధవారం ఛత్రస్థాపనోత్సవం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీవారి పాదాల వద్ద టిటిడి అర్చక బృందం ప్రత్యేకంగా అలంకరించిన గొడుగును ప్రతిష్టించారు. ముందుగా తిరుమల శ్రీవారి ఆలయంలో రెండో గంట తర్వాత పూజ సామగ్రి, పుష్పాలు, నైవేద్యం, గొడుగుతో మంగళవాయిద్యాల నడుమ ఆలయ మాడ వీధుల గుండా మేదరమిట్టకు చేరుకున్నారు. అక్కడి నుండి నారాయణగిరికి విచ్చేశారు. ముందుగా శ్రీవారి పాదాలకు తిరుమంజనం చేపట్టారు. అలంకారం, పూజ చేసి నైవేద్యం సమర్పించారు. వేదపారాయణదారులు ప్రబంధ శాత్తుమొర నిర్వహించారు. ఆ తరువాత భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. తిరుమల ఏడుకొండల్లో అత్యంత ఎత్తయిన నారాయణగిరి శిఖరంపై కలియుగంలో శ్రీవేంకటేశ్వరస్వామివారు మొదటగా కాలు మోపినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ద్వాదశి నాడు ఛత్రస్థాపనోత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవానికి మరో నమ్మకం కూడా ఉంది. సాధారణంగా ఈ కాలంలో గాలులు ఎక్కువగా వీస్తాయి. నారాయణగిరి శిఖరం ఎక్కువ ఎత్తులో ఉండడంతో మరింత ఎక్కువగా గాలులు వీస్తాయి. ఈ గాలుల నుంచి ఉపశమనం కల్పించాలని వాయుదేవుని ప్రార్థిస్తూ ఇక్కడ గొడుగును ప్రతిష్టిస్తారు. ఈ కార్యక్రమంలో శ్రీవారి ఆలయ అధికారులు, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

## దేశీయ విత్తనాలతో రాఖీలు తయారు చేద్దాం

### – జెవి రత్నం, వ్యవస్థాపక కార్యదర్శి, గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో



**విశాఖ పెన్ పవర్ ఆగస్టు 6 :** దేశీయ విత్తనాలతో రాఖీలు తయారు చేయడం చాలా తేలిక పని, పర్యావరణానికి మేలు చేస్తుందని గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం పేర్కొన్నారు. బుధవారం ఉదయం విశాఖ ఆటోమేటివ్ దగ్గర ఉన్న అక్షరా పబ్లిక్ స్కూల్లో, మిధిలాపూర్ లోని గ్లోబల్ స్కూల్లో, మారికవలస వద్ద ఉన్న ఇంటిల్లి విద్యాసంస్థలలో ఆంధ్రప్రదేశ్ కాలుష్యంత్రణ మండలి నేతృత్వంలో, గ్రీన్ క్లైమేట్ టీమ్ ఎన్జీవో ఆధ్వర్యంలో దేశీయ విత్తనాలతో రాఖీలు తయారు చేయించారు. ఆయా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మనం ఇంట్లో వినియోగించే మెంతులు, ధనియాలు, జీలకర్ర, ఆవాలు, పప్పులు, పెసలు, మినుములు, మినప గుళ్ళు, మనకు అందుబాటులో లభించే పక్షులు గూళ్ళు పెట్టుకునే చెట్ల విత్తనాలు, ఔషధ గుణాలు కలిగిన మొక్కల విత్తనాలు, పండ్ల జాతి చెట్ల విత్తనాలు వినియోగించి రాఖీలు తయారు చేయవచ్చు అని వివరించారు. మనకు కావలసిన, పక్షులు, వన్యప్రాణులు, చెట్లు, దేవుళ్ళ ఆకృతల ఇమేజెస్ మనకు అనువైన సైజులో తీసుకుని జిగురుతో విత్తనాలను దలసరి పేపర్ మీద అంటించడం ద్వారా రాఖీ తయారు చేయవచ్చని అన్నారు. పెద్ద పెద్ద రాఖీలను తయారు చేసి వందల ఏళ్ల నాటి మహావృక్షాలకు కట్టడం ద్వారా వృక్షాబంధన్ కార్యక్రమం తరువాయి 5లో..

### గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణం

## ప్రజలకు సురక్షితమైన త్రాగునీటి సరఫరా

### జిల్లాలో 15 ఆర్థిక కమిషన్ నిధులతో వివిధ మండలాలలో అభివృద్ధి పనులను సమీక్షించిన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్





**చిత్తూరు, పెన్ పవర్ ఆగస్టు 6 :** జిల్లాలో 15 ఆర్థిక కమిషన్ నిధులు మరియు జిల్లా పరిషత్ సాధారణ నిధుల కింద తాగునీటి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలి అని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ సంబంధితఅధికారులను ఆదేశించారు. బుధవారం జడ్పీ కార్యాలయంలోనే ఎన్టీఆర్ సమావేశం మందిరంలో జిల్లాలోని 15 ఆర్థిక సంఘం ద్వారా వివిధ మండలాలకు వచ్చిన నిధులను, మండలాలలో వివిధ అభివృద్ధి పనులు ఎలా చేపడుతున్నారు, వివిధ మండలాలలో పనులు ఎలా జరుగుతున్నాయని వాటిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రవి ప్రకాష్ నాయుడు, ఎస్. ఈ ఆర్డబ్ల్యూఎస్ విజయ్ కుమార్, పంచాయతీరాజ్ శాఖ ఎస్.ఈ చంద్రశేఖర్ రెడ్డి,ఎంపీడీవోలతో, పంచాయతీ రాజ్ శాఖ ఇంజనీర్లు, ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 15వ తరువాయి 4లో..

## బ్రిడ్జ్ బేరింగులు దెబ్బ తినడం వల్ల 8 నెలలుగా ఆగిన రాకపోకలు

### - 85 లక్షలతో మరమత్తు పనులు - ఎమ్మెల్యే పరిటాల సునీత చొరవతో 3నెలల్లో పనులు పూర్తి



**అనంతపురం, పెన్ పవర్ ఆగస్టు 06 :** అనంతపురం నగరం టీవీ టవర్ సమీపంలో, ఆర్డిటి క్రికెట్ స్టేడియం దగ్గర ఉన్న పండ మేరు పాత బ్రిడ్జిపై నేటి నుంచి రాకపోకలు పునః ప్రారంభం కానున్నాయి. గత ఏడాది అక్టోబర్ మాసంలో భారీ వర్షాలు కురవడం వల్ల.. వంకలో భారీగా నీరు ప్రవహించింది. బ్రిడ్జిని తాకుతూ నీరు రావడంతో బేరింగులు దెబ్బతిన్నాయి. అప్పట్లో ఎమ్మెల్యే పరిటాల సునీత ఈ బ్రిడ్జిని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. బ్రిడ్జ్ బేరింగ్ లు దెబ్బ తినడం వల్ల రాకపోకలు కొనసాగించడం ప్రమాదకరమని హెచ్చరించారు. దీంతో పక్కనే ఉన్న కొత్త బ్రిడ్జిపై వన్ వే లో రాకపోకులకు అంతరాయం లేకుండా చూడాలని ఎమ్మెల్యే సునీత ఆదేశించారు. పాత వంతెన మరమ్మతుల కోసం కోటి రూపాయలు అంచనాతో ప్రతిపాదనలను కేంద్ర రవాణా మరియు రహదారుల శాఖ వారికి అధికారులు పంపారు. కేంద్ర ప్రభుత్వంతో ఎమ్మెల్యే సునీత మాట్లాడి ఈ ఏడాది మార్చి 27న ఆమోదించేలా చేశారు. టెండర్ల ప్రక్రియను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ఏప్రిల్ 29న ముంబైకి చెందిన టెక్ ఫాస్ట్ రీబిల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి పనులు అప్పజెప్పారు. 85 లక్షల వ్యయంతో ఆరు నెలల కాలపరిమితిలోగా పాత వంతెన పనులను పునరుద్ధరించాలన్నారు. ఎన్.హెచ్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో కేవలం మూడు నెలల కాల పరిమితిలోనే పూర్తి చేసేలా ఎమ్మెల్యే పరిటాల సునీత పర్యవేక్షించారు. స్వయంగా బ్రిడ్జిని సందర్శించి అధికారులపై ఒత్తిడి చేశారు. దాదాపు 8 నెలలుగా వన్ వే మార్గంలో బ్రిడ్జి మీద రాకపోకలు సాగుతున్నాయి. దీనివల్ల పలుసార్లు ట్రాఫిక్ సమస్య కూడా ఏర్పడింది. ఎమ్మెల్యే పరిటాల సునీత కాంట్రాక్టర్లతో మాట్లాడి పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఇటీవల ఇదే మార్గంలో పైప్ లైన్ మరమ్మతులు కారణంగా రెండు రోజులు వాహనాల రాకపోకలు ఆగాయి. ఆ సమయంలో కూడా అధికారులతో మాట్లాడి బ్రిడ్జిని మరోసారి ఇంజనీరింగ్ అధికారులు పరిశీలించి రాకపోకలు ప్రారంభించే విధంగా చూడాలన్నారు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి పాత బ్రిడ్జిపై రాకపోకలు పునః ప్రారంభం కానున్నాయి. ఇన్ని రోజులు ప్రయాణికులకు వాహనదారులకు ఇబ్బంది కలిగిందని.. అయితే బ్రిడ్జి భద్రత దృష్ట్యానే రాకపోకలు ఆపినట్లు ఎమ్మెల్యే సునీత తెలిపారు. ఇక నుంచి యధావిధిగా రాకపోకలు కొనసాగుతాయని ఆమె ప్రజలకు తెలిపారు.

## శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ



**తిరుమల పెన్ పవర్ ఆగస్టు 6 :** తిరుమల శ్రీవారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా రెండో రోజు బుధవారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఈ సందర్భంగా ఉదయం యాగశాలలో హోమాలు తదితర వైదిక కార్యక్రమాలు చేపట్టారు. ఆ తరువాత సంపంగి ప్రాకారంలో వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. ఇందులో పాలు, పెరుగు, తేనె, చందనం, పసుపు తదితర సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. అనంతరం వేద ఘోష, మంగళవాయిద్యాల నడుమ శ్రీవారి మూలవర్లకు, ఉత్సవ మూర్తులకు, జయవిజయులకు, గరుడాళ్వారుకు, వరదరాజస్వామివారికి, వకుళమాత అమ్మవారికి, ఆనంద నిలయం, యాగశాల, విష్వక్సేనులవారికి, యోగనరసింహస్వామి వారికి, భాష్యకార్లకు, పోటు తాయారుకు, ధ్వజస్తంభం, బలిపీఠం, శ్రీభూవరాహస్వామివారికి, శ్రీ బేడి ఆంజనేయస్వామివారికి పవిత్రమాలలు సమర్పించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు ఆలయ నాలుగు మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. రాత్రి 8 నుంచి 11 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు జరుగనున్నాయి. పవిత్రోత్సవాలు తిరుమలలో 15-16 శతాబ్దాల వరకు జరిగినట్టు ఆధారాలున్నాయి. 1962వ సంవత్సరం నుంచి దేవస్థానం ఈ ఉత్సవాలను పునరుద్ధరించింది. చారిత్రక ఆధారాల ప్రకారం శ్రీస్వామివారి ఉత్సవమూర్తులకు కావలసిన పవిత్రాలు చేయడానికిగాను శ్రేష్టమైన జాతి పత్తి మొక్కలను అత్యంత పవిత్రమైన దైవమొక్కగా భావించే తులసి పెంచడానికి ఉపయోగించే పెరటి భూమిలో పెంచడం విశేషం. పవిత్రాలను తయారు చేయడానికి 20 మూరల పట్టుదారం గానీ లేదా 200 మూరల నూలుదారం గానీ ఉపయోగిస్తారు. ఈ దారాలకు తెలుపుతో పాటు నలుపు, ఎరుపు, ఆకుపచ్చ, పసుపుపచ్చ రంగులు అద్దకం చేస్తారు. ఈ కార్యక్రమంలో తిరుమల శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్ స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్ స్వామి, ఈవో జె.శ్యామలరావు, ఆదనపు ఈవో శ్రీ సిహెచ్ వెంకయ్య చౌదరి, ఆలయ ప్రధాన అర్చకులు, డెప్యూటీ ఈవో లోకనాథం ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో పలువురు మున్సిపల్ కమిషనర్ల బదిలీలు, నియామకాలు

**అమరావతి పెన్ పవర్ ఆగస్టు 6 :** వెయిటింగ్ లో ఉన్న పలువురు అధికారులకు కమిషనర్లుగా నియామకం

- మున్సిపల్ కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫీసులో జేడీగా రవీంద్ర బాబు నియామకం
- రాయచోటి మున్సిపల్ కమిషనర్ ఎన్. వాసుబాబు బదిలీ
- నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్ టీపీఆర్వో గా ఎన్.వాసుబాబు నియామకం
- రాయచోటి మున్సిపల్ కమిషనర్‌గా జి.రవి నియామకం
- శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ గా పి.భవానీ ప్రసాద్ నియామకం
- శ్రీకాకుళం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ సెక్రటరీగా ఎల్.సురేష్
- సాలూరు మున్సిపల్ కమిషనర్‌గా టీటీ రత్నకుమార్ నియామకం
- ప్రొద్దుటూరు మున్సిపాలిటీ సహాయ కమిషనర్ గా డి.కొండయ్య నియామకం
- కదిరి మున్సిపాలిటీ శానిటరీ ఇన్ స్పెక్టర్ బి.ప్రహ్లాద్ బదిలీ
- కమలాపురం మున్సిపల్ కమిషనర్‌గా బి.ప్రహ్లాద్ నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఎస్. సురేష్ కుమార్

## అతివేగంతో బస్సు-బైక్ ఢీ వాహనదారునికి తీవ్రమైన గాయాలు

### కాలు విరిగిన చౌడయ్యను " 108 ద్వారా రిమ్స్‌కు తరలింపు





**కమలాపురం పెన్ పవర్ ఆగస్టు 6 :** వల్లూరు మండల పరిధిలోని గోటూరు సమీపంలో ఈద్గా వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బాధితుడిని ఆదుకున్న పోలీసుల చర్యలు ప్రజల్లో ప్రశంసలతో కూడిన స్పందన కలిగిస్తున్నాయి, కడప నుండి ప్రొద్దుటూరుకు వెళ్తున్న బస్సు, ఎర్రగుంట్ల వైపు నుండి ద్విచక్ర వాహనంపై వస్తున్న యువకుడిని ఢీకొన్న ఘటనలో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. అతడి కాలు ఇరిగి, రక్తస్రావం జరగడం వల్ల ప్రాణాపాయ పరిస్థితిలో కొట్టుమిట్టాడుతూ కనిపించిన అతన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు, సమాచారం అందుకున్న వెంటనే వల్లూరు పోలీసులు అలర్ట్‌గా స్పందించారు, ఒక్కక్షణం ఆలస్యం చేయకుండా సంఘటన స్థలానికి చేరుకుని, బాధితుడికి ప్రాథమిక సహాయం అందించెందుకు 108 అంబులెన్స్ ద్వారా తక్షణమే కడప రిమ్స్‌కు తరలించారు, వారి వేగవంతమైన చర్య వల్ల చౌడయ్య అనే బాధితునికి సమయానికి వైద్యం అందించేందుకు రిమ్స్ కు తరలించారు, చౌడయ్య కాజీపేట మండలం, అప్పనపల్లి గ్రామానికి చెందినవాడుగా గుర్తింపు, ప్రమాద సమయంలో అతను తన ఉద్యోగ స్థలమైన కడపలోని జ్యువెలరీ షాపుకు బంధువుల ఇంటి నుండి బయలుదేరాడు, వల్లూరు పోలీసుల ఈ బాధ్యతాయుత స్పందనపై స్థానికులు అభినందనలు తెలుపుతున్నారు, పోలీసులు కేవలం చట్టాన్ని అమలు చేసేవారే కాదు, అవసరమైనప్పుడు జీవనదాతలుగా కూడా నిలుస్తారని మరోసారి నిరూపించారు అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

## పకృతిలో చల్లటి గాలి....




**కడప, పెన్ పవర్ ఆగస్ట్ 6 :** మనం ఆకాశంలోని నక్షత్రాలను చూడడానికి ఏమీ రుసుము చెల్లించనవసరం లేదు పాదాలతో గడ్డిపై నడవడానికి శ్రమపడనవసరం లేదు మనం ఒక చెట్టును ఆ లింగం చేసుకున్నప్పుడు షరతులు లేని ప్రేమను మాత్రమే పొందగలం. ఏదైనా చెట్టు కింద కూర్చొని చల్లటి గాలిని పీల్చండి ప్రకృతి అందించే పోషణతో మీ ఊపిరితిత్తులను విస్తరింప చేయండి ఇటువంటి ప్రపంచానికి కృతజ్ఞులై ఉండండి.

## కారుణ్య ఫౌండేషన్.. సేవలు అమూల్యం






**కడప పెన్ పవర్ ఆగస్టు 6 :** కడప నగరం బస్టాండ్ సమీపంలో తారసపడుతున్న బడి ఈడు స్కూలు పాప బస్టాండులో ఉన్న పాపను గమనించిన కారుణ్య ఫౌండేషన్ ఫౌండర్ అనూష ఆ పాపను అక్కున చేర్చుకుని, కారుణ్య ఫౌండేషన్ సిబ్బంది సహాయంతో పాప యొక్క వివరములు తెలుసుకొని, ఇటు ఇంటిలోనూ, అటు బడిలోనూ తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులు మందలించారని పాప పారిపోవడానికి ప్రయత్నించే క్రమంలో పాపను బుజ్జగించి తన హోమ్ కి తీసుకెళ్లి ఆకలితో ఉన్న ఆ పాపకు అన్న పానీయములు సమకూర్చి, కారుణ్య ఫౌండేషన్ సిబ్బంది మాబువల్లి ,శివప్రసాద్, సిద్ధం శ్రీనివాసులు, పాప యొక్క వివరాలు సేకరించి హోమ్ నుండి ఆ పాపను వారి యొక్క తల్లిదండ్రులను, మరియు బంధువులను పిలిపించి తల్లి దండ్రులకు మందలించకూడదని, అనూష హితవు పలికారు. ఏమైనా సమస్యలు ఉంటే పిల్లలకు అన్యోన్యంగా, స్నేహ పూర్వకంగా తెలియజేయాలని, పాపను వారి తల్లిదండ్రులకు అప్పగించడం జరిగింది. పాప వారి బంధువులు, తల్లిదండ్రులు కారుణ్య ఫౌండేషన్ కమిటీ సభ్యులకు ముఖ్యంగా చైర్మన్ అనూషకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేయడం జరిగింది.

### ఎస్పీడబ్ల్యూ మహిళా జూనియర్ కళాశాలను

## పరిశీలించిన టిటిడి ఛైర్మెన్





**తిరుపతి పెన్ పవర్ ఆగస్టు 6 :** ఎస్పీడబ్ల్యూ మహిళా జూనియర్ కళాశాలలో అత్యవసరమైన పనులను సకాలంలో పూర్తి చేయాలని టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు ఆదేశించారు. మహిళా జూనియర్ కళాశాల జేఈవో వి. వీరబ్రహ్మం, టిటిడి బోర్డు మెంబర్ జి. భానుప్రకాష్ రెడ్డి కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా టిటిడి ఛైర్మెన్ మాట్లాడుతూ, మహిళా జూనియర్ కళాశాలలో విద్యార్థినుల సమస్యలు తన దృష్టికి వచ్చాయని, విద్యార్థినులు ప్రాథమిక అవసరాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కళాశాలలోని సమస్యలను టిటిడి జేఈవో, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ తన దృష్టికి తీసుకువచ్చారని, వాటి అన్నింటిపై నివేదిక తయారు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

విద్యార్థినులు చదువుకునేందుకు కళాశాల పరిసరాలు చాలా బాగున్నాయన్నారు. అదేవిధంగా ఈ కళాశాలలో ఉత్తీర్ణత శాతం చాలా అద్భుతంగా ఉందని అభినందించారు. ముఖ్యంగా కళాశాలలో విద్యార్థినులకు హాస్టల్ సామర్థ్యాన్ని, వసతి సౌకర్యాన్ని పెంచాలని, వైద్య సౌకర్యాల పెంపు, వేడి నీటి కోసం సోలార్ వాటర్ హీటర్స్, ఈ - లెర్నింగ్ సెమినార్ హాల్ ఏర్పాటు, హాస్టల్ లో మరమ్మతులు, ఫిజికల్ ఎడ్యుకేషన్ సౌకర్యం తదితర అంశాలపై అధికారులు నివేదిక తయారు చేసి కార్యాచరణ సిద్ధం చేయాలని అధికారులకు టిటిడి ఛైర్మెన్ సూచించారు. అంతకుముందు టిటిడి ఛైర్మెన్ బీఆర్ నాయుడు అధికారులతో కలిసి కాలేజీ పరిసరాలను, వంట గది, హాస్టల్ ప్రాంతాలను తనిఖీ చేశారు. అటు తరువాత విద్యార్థినులు, తల్లిదండ్రులతో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిఈవో శ్రీ వెంకట సునీల్, ప్రిన్సిపాల్ డా. సి.భువనేశ్వరి, ఎస్.ఈ మనోహరం తదితరం అధికారులు పాల్గొన్నారు.

## మహిళలసాధికారత కోసమే మిషన్ శక్తి

### జిల్లా స్థాయి మిషన్ శక్తి కమిటీ సమావేశం : జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి



**వైయస్సార్ కడప పెన్ పవర్, ఆగస్టు 6 :** మహిళల భద్రత, సాధికారత కోసం కేంద్ర ప్రభుత్వం 'మిషన్ శక్తి' కార్యక్రమాన్ని ప్రారంభించిందనీ జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో.. మిషన్ శక్తి కార్యక్రమం అమలుపై జిల్లా స్థాయి మిషన్ శక్తి కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్, కమిటీ చైర్మన్ డా. శ్రీధర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...మిషన్ శక్తిలో 'సంబల్' మరియు 'సమర్థ్య' ఉప పథకాలను కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. "సంబల్" పథకం మహిళల భద్రతకు, "సమర్థ్య" పథకం మహిళల సాధికారత కోసం ఏర్పాటు చేసిందన్నారు. వన్ స్టాప్ సెంటర్లు ద్వారా చట్టపరమైన కౌన్సెలింగ్, మానసిక-సామాజిక కౌన్సెలింగ్లు అందించాలని అలాగే చైల్డ్ మ్యారేజ్ నిర్మూలనకు అవగాహన కల్పించాలన్నారు. సమర్థ్య పథకంలో భాగంగా బాధిత మహిళలకు పునరావసం కల్పించే శక్తి సదన్ లు కడపలో 3 మైదుకూరులో 1 పనిచేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో శక్తి సధన్లను బలోపేతం చేసి మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి నైపుణ్య శిక్షణలు, ఉపాధికి చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. బాలికల రక్షణ, విద్య, లింగ నిర్ధారణను నివారించేందుకే 'బేటీ బచావో.. బేటీ పడావో' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తోందన్నారు. ఈ పథకం కింద బాలికల పుట్టుపుట్టిన దశ నుండే సంరక్షణ కల్పించేందుకు ఐసిడీఎస్, ఆరోగ్య, విద్యా శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. 'మిషన్ శక్తి' లో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి మాతృత్వ వందన యోజన పథకం కింద మొదటిసారి ప్రసవానికి 5వేలు రూపాయలు , రెండవ ప్రసవంలో ఆడపిల్ల జన్మిస్తే 6వేలు రూపాయలు అందిస్తోందని తెలిపారు. మహిళల పరిరక్షణకు 181 ఉమెన్ హెల్ప్ లైన్ వినియోగించుకునేలా అవగాహన కల్పించాలన్నారు. పోష్ ఆక్ట్ కింద నమోదైన మూడు కేసులను పరిష్కరించామని తెలిపారు. అలాగే ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాలు, రైల్వే స్టేషన్, హాస్పిటల్స్ లలో మదర్ బ్రెస్ట్ ఫీడింగ్ రూమ్స్ ను ఏర్పాటు చేయాలన్నారు. మహిళలు, పిల్లల సమస్యలను తెలియచేయడానికి కార్యాలయాల్లో పాఠశాలల్లో సి బాక్సులను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో మహిళల కోసం చేపడుతున్న ప్రాజెక్టులు, స్కిల్స్ డెవలప్మెంట్ కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. మహిళల హక్కులు, రక్షణ కోసం మిషన్ శక్తినీ సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ మరియు మహిళా సాధికారిత అధికారి పి రమాదేవి, సోషల్ వెల్ఫేర్ డిడి సరస్వతి, డీఈవో శంషుద్దీన్,స్టెప్ సీఈవో సాయి గ్రేస్, సీపీవో హాజరత్తయ, కమిటీ సభ్యులు,తదితరుల పాల్గొన్నారు.

### గ్రామాలలో సిసి రోడ్ల నిర్మాణం

## ప్రజలకు సురక్షితమైన త్రాగునీటి సరఫరా

**(3వ పేజీ తరువాయి)** ఆర్థిక కమిషన్ నిధులు మరియు జిల్లా పరిషత్ సాధారణ నిధుల కింద గ్రామాలలో తాగునీటి పనులు నిర్ణీత సమయంలో పూర్తి చేయాలనిజిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. హౌసింగ్ కాలనీలలో లేఔట్లలో సమస్యలు ఉన్నట్లయితేవాటినిఎంపీడీవోలు తాసిల్దార్లతో సమన్వయం చేసుకొని త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ఎంపీడీవోలు మండల స్థాయిలో పలు అభివృద్ధి పనులకు నివేదికలు తయారు చేసిజడ్పీ సీఈఓ వారికిసమర్పించాలని తెలిపారు. ఎన్టిఆర్ హౌసింగ్ నిర్మాణాలలో మౌలిక వసతులుఖచ్చితంగా ఉండాలని అందుకుసంబంధించిన శాఖ అధికారులు త్వరితగతిన నాణ్యమైన పనులు చేపట్టాలని ఆదేశించారు. వివిధ గ్రామాలలో ఏమైనా పనులు జరగకపోతే అట్టి వాటి వివరాలను జడ్పి సీఈఓ గారికి తెలియజేసి నివేదిక సమర్పించాలన్నారు. ఇంకో నెలలోపు పనులన్నీ పూర్తి కావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రతి నియోజకవర్గానికి సంబంధించిన డేటా క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను లేఖ రూపంలో జడ్పి సీఈఓ వారికి అందజేయాలని తెలిపారు. జిల్లాలో ఏడు నియోజకవర్గాలకు సంబంధించి పంచాయతీరాజ్ శాఖ ద్వారా చేపట్టిన పనులలో రూ.146 కోట్ల అంచనా విలువగల 204, ఆర్డబ్ల్యూఎస్ శాఖ ద్వారా త్రాగునీటికి సంబంధించి రూ.93.17 కోట్ల అంచనా విలువగల 257 పనులు పెండింగ్ లో ఉన్నాయని, నిర్దేశిత కాలంలోపు పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.




గోస్పాడు మండల కేంద్రంలోని శ్రీ వెంకట సాయి ఫర్టిలైజర్స్ షాప్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి పరిశీలిస్తున్న కలెక్టర్

## విద్యార్థులకు ఆరోగ్య సూత్రాలు....




**నంద్యాల పెన్ పవర్ ఆగస్టు 6 :** నంద్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ వారి కార్యాలయంలో జిల్లా వైద్య అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ గారి అధ్యక్షతన నంద్యాల జిల్లాలోని ప్రైవేట్ స్కూల్ యాజమాన్య సభ్యుల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఆగస్టు 12వ తేదీ జరగబోయే నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని చెప్పి తెలియజేయడం జరిగింది. భోజనం అనంతరం విద్యార్థులకు ఇచ్చేటువంటి ఆల్బెండజోలు మాత్రలు నమిలి చప్పరించి మింగించవల సిందిగా తెలియజేశారు. నులిపురుగులు నివారణ మాత్రను విద్యార్థులకు ఇవ్వడం వలన విద్యార్థులు ఉన్నటువంటి రక్తహీనతను తొలగించవచ్చని అలాగే, విద్యార్థులు మరుగుదొడ్లు ఉపయోగించిన తర్వాత మరియు ఆటలు ఆడిన తర్వాత చేతులను శుభ్రం పరచుకోవాలని ఈ సమావేశంలో నంద్యాల జిల్లా ప్రైవేట్ స్కూల్ యాజమాన్యానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఆర్ వెంకటరమణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రవేట్ స్కూల్ యాజమాన్య కమిటీ బాల మద్దిలేటి ప్రెసిడెంట్ మరియు భాస్కర్ జనరల్ సెక్రెటరీ, దస్తగిరి జిల్లా అడ్వైజర్, రమణయ్య గౌడ్ టౌన్ ట్రెజరర్ వరప్రసాద్ రెడ్డి ఎగ్జిక్యూటివ్ నెంబర్ వెంకటేశ్వర్లు ఎగ్జిక్యూటివ్ నెంబర్ మరియు జిల్లా ప్రోగ్రామ్ ఆఫీసర్లు ప్రోగ్రాం మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలపై దృష్టి సారించాలి : ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ

**అనంతపురం పెన్ పవర్,ఆగస్టు 6 :** ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల పై ప్రత్యేక దృష్టిని సారించి వాటిని అమలు చేయాలని అలాగే సి.యం. ఓ. మంత్రులు మరియు ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీ, రెవెన్యూ సెక్టార్, పి జి ఆర్ ఎస్ , వివిధ సేవా పోస్టర్ల ద్వారా వచ్చిన ఫిర్యాదుల పెండింగ్ పనులను వేగవంతం చేసిఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి డివిజన్ , మండల స్థాయి రెవెన్యూ సెక్టార్ తదితర అంశాలకుసంబంధించిన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఇన్చార్జ్ కలెక్టర్ సమీక్షిస్తూ ముఖ్యంగా వివిధ రీతిలో స్వీకరించిన ఫిర్యాదులపై స్పందించివాటిని క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో ఆయా శాఖలోపనిచేస్తున్నఉద్యోగ సిబ్బందిసేవలను వినియోగించుకొనిఅర్జీదారులు సంతృప్తి పొందేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకుమంచినీటిసేవలఅధికారులుముందుకు వెళ్లాలని పేర్కొన్నారు. ప్రస్తుతవర్షాకాలంలోపంచాయతీ పరిధిలో పారిశుధ్య పనులు క్రమం తప్పకుండా చేపట్టాలని అలాగేచెత్తసేకరించితరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ అంశంలో సంబంధిత శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి సమస్యలు లేకుండా పర్యవేక్షణ చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారు. పౌరసరఫరా, పిజిఆర్ఎస్, ఐవిఆర్ఎస్ చుక్కల భూముల ప్రక్రియ తదితర అంశాలలో పురోగతిని సాధించాలని, క్షేత్రస్థాయిలో ఉన్నతాసిల్దారులు, సి ఎస్ డి టి లు పిఎఫ్ షాపుల తనిఖీ తో పాటు నిత్యవసరసరుకులు సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని, ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు. గుంతకల్, ఉరవకొండ, బొమ్మనహాల్, పామిడి ఎల్లనూరు, యాడికి తదితర మండలాల్లో రీఓపెన్ కేసులు ఉన్నందున వాటిని సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సహార్, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, డీఎస్ఓ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పీడీ శైలజ , ఈజీ ఆర్ ఎస్ తాసిల్దార్ వాణిశ్రీ, సర్వే ఏ.డి. రూప్ల నాయక్, కలెక్టరేట్ సూపర్డెంట్లు యోగేశ్వరి దేవి రియాజుద్దీన్, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ దృశ్యమాలిక



## దేశీయ విత్తనాలతో రాఖీలు తయారు చేద్దాం



(3వ పేజీ తరువాయి) నిర్వహించి మహా వృక్షాలను అడవులను సమస్త జీవరాసిని కాపాడుకోవాలని ప్రజానికానికి అవగాహన కల్పించడం అవసరం అన్నారు. ఒకసారి వాడి వదిలేసే ప్లాస్టిక్ తో తయారుచేసిన రాఖీలు వినియోగించవద్దని కోరారు. అక్షర విద్యా సంస్థలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సునీత, గ్రూప్ విచార సంస్థలు నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లలిత, మారికవలస లోని ఇంటెల్లి విద్యాసంస్థలు నిర్వహించిన కార్యక్రమంలో అనిత పలువురు ఉపాధ్యాయులు, పాల్గొని రాఖీలు తయారు చేశారు. యాక్షన్ ఎయిడ్ కర్ణాటక సంస్థ ఫెసిలిటేటర్ ఐ కృష్ణ కుమారి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో కోఆర్డినేటర్ జె.రాజేశ్వరిపాల్గొన్నారు.

## ప్రిసైడింగ్ అధికారులకు బ్యాలెట్ బాక్స్‌లపై శిక్షణ






**వైయస్సార్ కడప పెన్ పవర్, ఆగస్టు 6 :** పులివెందుల ఒంటిమిట్ట జడ్పిటిసి ఉప ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులకు బ్యాలెట్ బాక్స్ వినియోగంపై పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని జెడ్పి సీఈవో&రిటర్నింగ్ అధికారి ఓబులమ్మ అన్నారు.

బుధవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలు నందు ప్రిసైడింగ్ అధికారులకు,ఏపీవో లకు బ్యాలెట్ బాక్స్ ల వినియోగంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సీఈవో సి.ఓబుళమ్మ, పులివెందుల అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ వెంకటపతి, ఒంటిమిట్ట అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్ రంగస్వామి, డివిషనల్ డెవలప్మెంట్ ఆఫీసర్స్ వి.విజయలక్ష్మి, వి.రామాంజనేయులు, రిసోర్స్ పర్సన్స్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులు అవసరం మేరకు యూరియా వినియోగించాలి

## అధిక ధరకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు : జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా





గోస్పాడు, పెన్ పవర్ ఆగస్టు, 06 : ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందజేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా వైద్యాధికారులను ఆదేశించారు. బుధవారం గోస్పాడు మండల కేంద్రంలో కలెక్టర్ సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు సేవ కేంద్రం, ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ముందుగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో ఎంత మంది సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు ? ఎన్ని డెలివరీ కేసులు నమోదు అయ్యాయి ? ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే వారికి సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయా లేదా ? గడువు తేది ముగిసిన ఔషధాలను ఏం చేస్తున్నారు అని వైద్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సదుపాయం అందిస్తారనే ధీమాతో ప్రజలు ఆసుపత్రులకు వస్తారని, ఆ మేరకు పీహెచ్సీలో మెరుగైన వైద్యం అందించాలన్నారు. అదే విధంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీ అవ్వడం శ్రేయస్కరం అనే విషయం పట్ల ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఎక్కువ శాతం ప్రభుత్వ ఆసుపత్రుల్లో డెలివరీలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. అందుకు అవసరమైన సిబ్బంది కొరత ఉంటే కూడా భర్తీ చేసేలా చర్యలు తీసుకోవడం జరుగుతోందని కలెక్టర్ తెలిపారు. అంతేకాకుండా ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆవరణంలో పరిశుభ్రతను తప్పనిసరిగా పాటించాలన్నారు. అనంతరం వైద్య చికిత్స కోసం వచ్చిన వారితో కూడా కలెక్టర్ మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఏ సమస్యతో ఆసుపత్రికి వచ్చార, వైద్యులు బాగా చూస్తున్నారా, వైద్య సేవలు ఎలా ఉన్నాయి, టెస్టులు ఇక్కడే నిర్వహిస్తున్నారా లేదా తదితర అంశాలలో వచ్చిన పేషంట్లను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడికి సమీపంలోని రైతు సేవ కేంద్రాన్ని పరిశీలించారు. ఎంత మేర రైతుల పొలాలు రైతు సేవా కేంద్రంలో నమోదు అయ్యాయి, రైతులందరికి ఈ పంట నమోదు, రైతుల ఈ-కెవైసి పూర్తి చేశారా, ఎంత విస్తీర్ణం పూర్తి చేశారు, ఇంకా ఎంత చేయాల్సి ఉంది, యూరియా లభ్యత ఎంత మేర ఉంది, ఇంకా అదనంగా ఎంత మేర యూరియా అవసరం అనే విషయాలను రైతు సేవా కేంద్రం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అదే విధంగా రైతులకు పంటలకు సరిపడా యూరియా మాత్రమే వినియోగించేలా అవగాహన కల్పించాలని తద్వారా భూసారం తగ్గకుండా పంటకు సరిపడా దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని శ్రీ వెంకట సాయి ప్రైవేటు ఎరువుల దుకాణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణంలో ఎరువులు, డిఎపి ఎంత మేర నిల్వలు ఉన్నాయని రిజిస్టర్లను పరిశీలించారు. ఎరువుల అవసరం మేరకు రైతులు వచ్చినప్పుడు అధిక ధరకు విక్రయించకుండా ప్రభుత్వం నిర్దేశించిన ధరకు మాత్రమే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చట్ట పరమైన కేసులు నమోదు చేయడం జరుగుతుందని దుకాణదారులను కలెక్టర్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ ఎంపీడీవో పీహెచ్సీ వైద్యులు సిబ్బంది, ఆర్ఎస్కే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మీరు ఎప్పుడైనా భగవంతుని చూశారా?

### - పెన్ పవర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి



Shri.S.Krishna Reddy
REGIONAL DIRECTOR, EDUCATIONAL CELL, A.P&TS





**కడప పెన్ పవర్ ఆగస్టు 6 :** చూడటానికి ఆయన ఎలా ఉంటాడు? ఆయన ఉనికిని అనుభూతి చెందడానికి మనకు ఏమి అవసరమో మీరు ఎప్పుడైనా ఆలోచించారా?

**ప్రార్థన యొక్క శక్తి**

ఒక వృద్ధురాలు కూరగాయల దుకాణానికి వెళ్ళింది. కానీ కొనడానికి ఆమె వద్ద డబ్బు లేదు. కూరగాయలు అప్పుగా ఇవ్వమని దుకాణదారుని అభ్యర్థించింది, కానీ దుకాణదారుడు నిరాకరించాడు. ఆమె పదే పదే అడుగగా, దుకాణదారుడు "నీ వద్ద ఏదైనా విలువైన వస్తువు ఉంటే, ఈ త్రాసుపై ఉంచు. దాని బరువుకు సమానమైన కూరగాయలు ఇస్తాను", అని చెప్పాడు. వృద్ధురాలు కాసేపు ఆలోచించింది. ఆమె వద్ద అలాంటిదేమీ లేదు. కాసేపు ఆలోచించిన తర్వాత, ఒక కాగితం తీసి, దానిపై ఏదో రాసి, త్రాసుకి ఒక వైపు ఉంచింది. అది చూసి దుకాణదారుడు నవ్వడం మొదలుపెట్టాడు. అయినప్పటికీ, కొన్ని కూరగాయలను తీసి, త్రాసులోని ఒక తక్కెడలో పెట్టి ఆశ్చర్యపోయాడు! కారణం, కాగితం ఉన్న తక్కెడ దిగువకు, కూరగాయల తక్కెడ పైకి కదిలింది. అప్పుడు అతను మరిన్ని కూరగాయలను వేసాడు, కాని కాగితం ఉన్న తక్కెడ పైకి రాలేదు. ఇప్పుడు దుకాణదారుడు మరికొన్ని కూరగాయలను ఉంచాడు, కాని కాగితం ఉన్న తక్కెడ మాత్రం ఇప్పటికీ క్రిందకే ఉంది. ఎన్ని కూరగాయలు వేసినా, కాగితం ఉన్న తక్కెడ పైకి లేవకపోవడంతో, దుకాణదారుడు విసుగు చెంది, కాగితం తీసుకుని దాని మీద ఏమి వ్రాసిఉందో చదివాడు.

కాగితంలో ఇలా రాసి ఉంది,

" ఓ భగవంతుడా, నన్ను చూసుకునే బాధ్యత నీదే, ఇప్పుడు ప్రతిదీ మీ చేతుల్లోనే ఉంది." ఇది చదివి దుకాణదారుడు చాలా ఆశ్చర్యపోయి, తన కళ్లను తానే నమ్మలేక ఆ కాగితాన్ని మళ్లీ మళ్లీ చదివాడు. కానీ ఏమీ అర్థం కాలేదు, ఏమీ మాట్లాడకుండా కూరగాయలు వృద్ధురాలికి ఇచ్చాడు.

అక్కడే నిలబడి ఇదంతా చూస్తున్న మరొక వ్యక్తి, "ఆశ్చర్యపోవద్దు ! ఆ ముసలావిడ ఈ కాగితంపై హృదయపూర్వకంగా ప్రార్థన వ్రాసింది, ప్రార్థన విలువ ఆ భగవంతునికి మాత్రమే తెలుసు" అని దుకాణదారునికి వివరించాడు. మనం భగవంతుని ప్రార్థించాలి, మన జీవితంలో ఆయన ఉనికిని అనుభవించడంలో సహాయం చేయమని ఆయనను అభ్యర్థించాలి. ఒక గంటైనా, నిమిషం అయినా సరే, ప్రార్థన హృదయపూర్వకంగా చేస్తే, భగవంతుడు తప్పకుండా సహాయం చేస్తాడు. ఈ కథలో కూరగాయల అమ్ముకునేవాడు, కొంటున్న వృద్ధురాలి ప్రార్థన రూపంలో భగవంతుని ఉనికిని అనుభవించాడు. మనం భగవంతుని ప్రత్యక్షంగా చూడలేం, కానీ చాలా సూక్ష్మ ప్రకంపనల ద్వారా ఆయన ఉనికిని అనుభూతి చెందగలం. ఆయన మాట వినడానికి మనం మౌనం పాటించాలి...

ఎందుకంటే భగవంతుని భాష నిశ్శబ్దం, అది దానికి అదే సంపూర్ణమైనది. నిజానికి, మనం చేసే ప్రతి పనిలో భగవంతుడిని భాగస్వామిగా చేసుకోవాలి. మనం ఆయన గురించి ఆలోచించినప్పుడు, మన సమస్యలపై మన దృక్పథం కూడా మారడం మొదలవుతుంది. ప్రేమ, భక్తితో నిండిన హృదయంతో చేసిన ప్రార్థన ఎప్పుడూ వృధా కాదు.

**బాబూజీజి**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**

## అభివృద్ధి అంతా కాంగ్రెస్ పాలనలోనే..



జెండా ఊపి కాంగ్రెస్ పార్టీ ప్రచారాన్ని ప్రారంభించిన డాక్టర్ తులసి రెడ్డి

వేంపల్లి పెన్ పవర్ ఆగస్టు 6 : పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నిక ప్రచారాన్ని రాజ్య సభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి బుధవారం వేంపల్లి లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ ఈనెల 12వ తేదీన పులివెందుల మండల జడ్పిటిసి ఉపఎన్నిక జరగబోతోంది. ఈ ఎన్నికల్లో మొయిళ్ళ శివ కళ్యాణ్ రెడ్డి హస్తం గుర్తు మీద కాంగ్రెస్ తరపున పోటీ చేస్తున్నారు .హస్తం గుర్తు మీద ఓటు వేసి కాంగ్రెస్ అభ్యర్థి అయిన శివ కళ్యాణ్ రెడ్డిని గెలిపించాలని పులివెందుల మండల ఓటర్లకు తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు .అటు పులివెందుల మండలంలో గాని ,ఇటు పులివెందుల నియోజకవర్గంలో గాని జరిగిన అభివృద్ధిలో సింహభాగం కాంగ్రెస్ పాలనలోని జరిగిందని తులసి రెడ్డి చెప్పారు. విద్యారంగానికి సంబంధించి పులివెందులలో జెఎన్టియు ,ఇడుపులపాయలో ట్రిపుల్ ఐటి ఇవి రెండూ కూడా కాంగ్రెస్ పార్టీ హయాం లోనే వచ్చాయని తులసి రెడ్డి గుర్తు చేశారు .సాగునీటి రంగానికి సంబంధించి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, పైడిపాలెం రిజర్వాయర్,లింగాల కెనాల్ ఇవన్నీ కూడా కాంగ్రెస్ పార్టీలోనే వచ్చాయని చెప్పారు. పులివెందుల టౌన్ లోనే కాకుండా పులివెందుల నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో సిమెంట్ రోడ్లు, పులివెందులకు రింగ్ రోడ్లు,పులివెందుల కడప నాలుగు వరుసల రోడ్డు ఇవన్నీ కూడా కాంగ్రెస్ పార్టీలోని వచ్చాయని ఆయన గుర్తు చేశారు. పులివెందుల పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, శిల్పారామం, అంతర్జాతీయ పశు పరిశోధనా కేంద్రం ఇవన్నీ కూడా కాంగ్రెస్ పాలన లోనే వచ్చాయని గుర్తు చేశారు .వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్తు ,పంటల బీమా సకాలంలో అమలు చేయడం, ఇన్పుట్ సబ్సిడీ సకాలంలో ఇవ్వడం ,పావలా వడ్డీ రుణాలు ,సున్నా వడ్డీ రుణాలు ,రుణమాఫీ పథకం ఈ విధంగా అనేక రైతు అనుకూల విధానాల ద్వారా వ్యవసాయం దండుగ కాదు పండుగనే విధంగా కాంగ్రెస్ పార్టీలో పరిపాలన సాగింది అని తులసిరెడ్డి గుర్తు చేశారు .ఆరోగ్య రంగానికి సంబంధించి ఆరోగ్యశ్రీ గాని ,108 గాని ,104 గాని ,విద్యారంగానికి సంబంధించి ఫీజు రియంబర్స్మెంట్ ,స్కాలర్షిప్ పథకాలు, ఇల్లకు సంబంధించి ఇందిరమ్మ ఇల్లు ,బంగారు తల్లి ,అమ్మ హస్తం ఇలాంటి అనేక పథకాలు కాంగ్రెస్ పార్టీ అమలు చేసిందన్నారు.కాంగ్రెస్ పార్టీ అందరి పార్టీ. కాంగ్రెస్ పార్టీ రైతుల పార్టీ .కాంగ్రెస్ పార్టీ ఒక కామదేనువు లాంటిది .కాంగ్రెస్ గుర్తు హస్తం .హస్తం మనం నేస్తం. కాంగ్రెస్ హస్తం అభయ హస్తం. కాబట్టి హస్తం గుర్తు మీద ఓటేసి కాంగ్రెస్ జడ్పిటిసి అభ్యర్థి శివ కళ్యాణ్ రెడ్డిని గెలిపించాలని పులివెందుల మండల ప్రజానీకానికి తులసిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి విజయ జ్యోతి, ధృవకుమార్ రెడ్డి,అభ్యర్థి మొయిళ్ళ శివ కళ్యాణ్ రెడ్డి,అమర్ నాథ్ రెడ్డి, సిరాజుదీన్,గౌస్ పీర్, రామ కృష్ణ,సుబ్రమణ్యం,వెంకటేష్,రామాంజనేయ రెడ్డి,ఉత్తన్న, నాగరాజు,వేమయ్య,వేమా రాజా,రవి,రమణ,గంగయ్య,సుధాకర్ రెడ్డి,నరసింహం, హరి ప్రసాద్, సంజయ్ కాంత్,విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ పలువురికి గాయాలు

**గంగవరం ,పెన్ పవర్ ,ఆగస్టు 6 :** జాతీయ రహదారి 516 ఈ ప్రధాన రహదారిలోని అడ్డపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులకు గాయాలైనట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు. గంగవరం మండలం అడ్డపల్లి సమీపంలో బుధవారం రాత్రి ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో వాహనాలపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం జరిగినట్లు సమాచారం అందుకున్న ఎస్సై వెంకటేష్ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో రంపచోడవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## 8న కాణిపాకంకు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జి రాక

**చిత్తూరు, పెన్ పవర్ ఆగస్టు 06 :** ఆంధ్ర ప్రదేశ్ హై కోర్టు జడ్జి శ్రీ వి.గోపాల్ కృష్ణా రావు ఈ నెల 08న జిల్లాకు రానున్నారని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హై కోర్టు జడ్జి ఆగస్టు 08న శుక్రవారం ఉ.10 గం.లకు కాణిపాకం విచ్చేసి కుటుంబ సమేతంగా వరసిద్ధి వినాయక స్వామిని దర్శించుకుంటారని, అనంతరం ఆలయ గెస్ట్ హౌస్ లో విశ్రాంతి తీసుకుని ఉ.11.30 గం.లకు తిరుచానూరు బయల్దేరి వెళతారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## రాయలసీమ ఉద్యమ నేత, టిఎన్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సేవలో చైర్మన్ తిప్పిరెడ్డి నాగిరెడ్డి



**తాడిపత్రి పెన్ పవర్ ఆగస్టు 6 :** తాడిపత్రి పట్టణములోని యల్లనూర్ రోడ్డులో ఉన్న రాయలసీమ యునైటెడ్ ఫోర్స్ కార్యాలయంలో యక్కలూరు రంగనాయకులుకు తాడిపత్రి మున్సిపాలిటీలోని విశాల్ మార్ట్ ఎదురుగా ఉన్న సాయి నగర్ కాలనీలో దాదాపు ఆరు లక్షల రూపాయల విలువైన తన ప్లాట్‌ను రిజిస్ట్రేషన్ చేయించి సొంతింటి నిర్మాణం కోసం కూడా లక్ష రూపాయల నగదును విరాళంగా రాయలసీమ ఉద్యమ నేత, టీఎన్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ తిప్పిరెడ్డి నాగార్జున రెడ్డి గారు అందజేయడం జరిగింది, ఈ కార్యక్రమంలో రఫ్ నాయకులు పుట్లూరు బాస్కర్ రెడ్డి, భగత్ సింగ్ నగర్ కు చెందిన వై నరసింహులు పాల్గొన్నారు..

## సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి : జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా

**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 6 :** సీనియర్ సిటిజన్ నిర్వహణ, సంక్షేమ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్‌లో సీనియర్ సిటిజన్ నిర్వహణ, సంక్షేమ చట్టం,2007 అమలుపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులు, తల్లిదండ్రుల నిర్వహణ, సంక్షేమం కోసం సీనియర్ సిటిజన్ నిర్వహణ, సంక్షేమ చట్టం,2007 ను ప్రవేశపెట్టారన్నారు.. తమను తాము ఆర్థికంగా పోషించుకోలేని తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లకు ఆర్థిక సహాయం సంరక్షణ అందించాలని ఈ చట్టం నిర్దేశిస్తుందన్నారు. నేటి సమాజంలో బంధాలు, అనుబంధాలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు..పిల్లలు తమను చూసుకోవడం లేదని పిజిఆర్ఎస్ లో ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు..గుడివాడ ఆర్డీవో గా 2011 లో ఈ చట్టాన్ని అమలు చేస్తూ తల్లిదండులను నిర్లక్ష్యం చేసిన ఒక వ్యక్తికి రూ. 10 వేలు నిర్వహణ మొత్తాన్ని మంజూరు చేయాలని ఫస్ట్ ఆర్డర్ పాస్ చేశానని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు.

## "లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులుపై రివ్యూ మీటింగ్"



**కర్నూలు పెన్ పవర్ ఆగస్టు 6 :** జి.కబర్థి, చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కర్నూలు వారి సూచనల మేరకు బి. లీలా వెంకట శేషాద్రి, సెక్రటరీ-కం-సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, కర్నూలు వారు కర్నూలు కోర్టు కాంపౌండ్ లో గల న్యాయ సేవా సదన్ నందు "లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులుపై రివ్యూ మీటింగ్" నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా మాట్లాడుతూ "లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ విధులు, చట్టపరమైన సలహాలు, జైలు విజిట్లు, కేసుల వివరాలు మరియు పరిష్కారము మొదలగు అంశాలను వివరించారు.అలాగే ఎన్ని కేసెస్ లలో బెల్స్ మంజూరు చేశారో కేసుల యొక్క స్థితిగతులను తెలుసుకొని వాటిని ఏ విధంగా త్వరిత గతిన పరిష్కరించాలో అనే దానిపై సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శివరాం, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ ఏ. సులోచన పాల్గొన్నారు.

## మధ్యవర్తిత్వంపై న్యాయవాదులతో సమీక్ష సమావేశం



**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 6 :** సుప్రీం కోర్ట్ మధ్యవర్తిత్వ విభాగం సూచనల మేరకు రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ ఆదేశాల మేరకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్థి గారి సూచనల మేరకు జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకట శేషాద్రి గారు బుధవారం నాడు కర్నూలు న్యాయ సేవ సదన్ నందు మధ్య వర్తిత్వంపై శిక్షణ పొందిన న్యాయవాదులతో మధ్యవర్తిత్వ కేసుల పురోగతిపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. మధ్యవర్తిత్వం ద్వారా వీలైనంత ఎక్కువ కేసులు పరిష్క రించేలా కృషి చేయాలని న్యాయవాదులకు సూచించారు. ఈ మీడియేషన్ ప్రక్రియలో న్యాయవాదుల సహాయ సహకారాలు ఉంటే కేసులు ఎక్కువగా పరిష్కారమైతాయని తెలిపారు. ఈ సమావేశంలో మీడియేషన్ శిక్షణ పొందిన న్యాయవాదులు పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్ సంక్షేమ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

### తల్లిదండ్రులను సంరక్షించాల్సిన బాధ్యత పిల్లలపై ఉంది

### - జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా






**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 6:** సీనియర్ సిటిజన్ నిర్వహణ, సంక్షేమ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్ లో సీనియర్ సిటిజన్ నిర్వహణ, సంక్షేమ చట్టం,2007 అమలుపై అవగాహనా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వయోవృద్ధులు, తల్లిదండ్రుల నిర్వహణ, సంక్షేమం కోసం సీనియర్ సిటిజన్ నిర్వహణ, సంక్షేమ చట్టం,2007 ను ప్రవేశపెట్టారన్నారు.. తమను తాము ఆర్థికంగా పోషించుకోలేని తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్లకు ఆర్థిక సహాయం సంరక్షణ అందించాలని ఈ చట్టం నిర్దేశిస్తుందన్నారు. నేటి సమాజంలో బంధాలు, అనుబంధాలు దూరమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు..పిల్లలు తమను చూసుకోవడం లేదని పిజిఆర్ఎస్ లో ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయన్నారు..గుడివాడ ఆర్డీవో గా 2011 లో ఈ చట్టాన్ని అమలు చేస్తూ తల్లిదండులను నిర్లక్ష్యం చేసిన ఒక వ్యక్తికి రూ. 10 వేలు నిర్వహణ మొత్తాన్ని మంజూరు చేయాలని ఫస్ట్ ఆర్డర్ పాస్ చేశానని కలెక్టర్ గుర్తు చేసుకున్నారు..ఆర్థిక స్థోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లలు సంరక్షించని పక్షంలో మెయింటెనెన్స్ కోసం సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ లేదా ఆర్డీవో కు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. నిర్వహణ ట్రిబ్యునల్ ద్వారా సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ లేదా ఆర్డీవో లు ఈ దరఖాస్తులను విచారించి నిర్వహణ మొత్తాన్ని నెలకు గరిష్ట పరిమితి రూ. 10 వేలు విధించవచ్చని కలెక్టర్ తెలిపారు..ఈ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి సీనియర్ సిటిజన్స్ హక్కులను కాపాడాలని, చట్ట ప్రకారంగా వైద్య సదుపాయాలు, వారికి లభించే అన్ని హక్కులను అందచేయాలని కలెక్టర్ సబ్ కలెక్టర్, ఆర్డీవోలను ఆదేశించారు. డివిజన్ల వారీగా ఎన్ని కేసులు వచ్చాయి అని సబ్ కలెక్టర్, ఆర్డీవోలను అడిగి తెలుసుకున్నారు.. పత్తికొండ డివిజన్లో 6 కేసులు రాగా 2 కేసులు పరిష్కరించామని, కర్నూలు డివిజన్లో 13 కేసులు రాగా 6 కేసులు పరిష్కరించామని, ఆదోని డివిజన్లో 13 కేసులు రాగా, ఆరు కేసులు పరిష్కరించామని సబ్ కలెక్టర్, ఆర్డిఓలు వివరించారు..ఆర్డర్ పాస్ చేసిన తర్వాత, అమలవుతోందా లేదా అని కూడా ఫాలో అప్ ఉండాలని కలెక్టర్ ఆదేశించారు..జిల్లా అధికారులు కూడాఎక్కడైనా సీనియర్ సిటిజన్ లకు సంరక్షణ లేకపోతే, చట్టం గురించి అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో 15 వృద్ధాశ్రమాలు ఉన్నాయని, వాటిని జిల్లా అధికారులు విజిట్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.. వృద్ధాశ్రమాలు ఎలా నడుస్తున్నాయి, నిర్వహణ ఎలా ఉంది, ఏమైనా అవసరాలు ఉన్నాయా పరిశీలించి నివేదిక అందజేయాలని కలెక్టర్ జిల్లా అధికారులను ఆదేశించారు. అనంతరం అడ్వకేట్ మోహన కృష్ణ, రిటైర్డ్ డీఎస్పీ, అడ్వకేట్ పాపారావు, డా.నాగరాజు, రిటైర్డ్ ప్రిన్సిపల్ తదితరులు చట్టంపై అవగాహన కల్పించారు. సమావేశంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్వో వెంకట నారాయణమ్మ, ఆర్డీవోలు సందీప్ కుమార్, భరత్ నాయక్, వికలాంగుల సంక్షేమ శాఖ ఏడి రాయిస్ ఫాతిమా, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఈరోజు జీవితంలో మనం ఎలా ఉన్నామో....

### మనల్ని ఆదుకోవడంలో ఎంతమంది చేతులు మనవెనకున్నాయో తెలుసా? : డాక్టర్ సునీత... కన్హ శాంతి వనం





**కన్హ పెన్ పవర్ ఆగస్టు 6 :** ప్రార్థించే చేతులు

పదిహేనవ శతాబ్దంలో, నూరేంబర్గ్ సమీపంలోని ఒక చిన్న గ్రామంలో, పద్దెనిమిది మంది పిల్లలతో ఒక డ్యూరర్ కుటుంబం నివసించేది.

అంతమంది పిల్లలకు కేవలం భోజనం సమకూర్చడానికి కుటుంబపెద్ద, వృత్తిరీత్యా స్వర్ణకారుడు అయిన తండ్రి, డ్యూరర్, వ్యాపారంలో రోజుకు దాదాపు పద్దెనిమిది గంటలు పని చేయడమే కాకుండా, డబ్బు కోసం ఇరుగుపొరుగున దొరికే ఏ పనినైనా అంగీకరించేవాడు. వారి పరిస్థితి అంత నిరాశాజనకంగా ఉన్నప్పటికీ, అందులో ఇద్దరు పిల్లలు ఒక కలగన్నారు.

వారిద్దరూ లలితకళల్లో తమ ప్రతిభను పరీక్షించుకోవాలని కోరుకున్నారు, కానీ, వారిలో ఏ ఒక్కరినైనా అకాడమీలో చదువుకోవడానికి, నూరేంబర్గ్ కు పంపడానికి వారి తండ్రి తమను ఆర్థికంగా ఎప్పటికీ ఆదుకోలేరని, వారికి తెలుసు.

రాత్రివేళ జరుపుకున్న చాలా సుదీర్ఘ చర్చల తర్వాత, ఆ ఇద్దరు అబ్బాయిలు చివరకు ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు. వారు బొమ్మ - బొరుసు వేసుకుని, ఓడిపోయిన వ్యక్తి సమీపంలోని గనుల్లోకి వెళ్లి, పని చేసి, తన సంపాదనతో, గెలిచిన అతని సోదరుడు అకాడమీలో చేరడానికి మద్దతుగా నిలవాలి. గెలిచిన ఆ సోదరుడు తన నాలుగు సంవత్సరాల చదువును పూర్తి చేసిన తర్వాత, అతను తన కళాఖండాల అమ్మకాలతో లేదా అవసరమైతే, గనులలో పని చేయడం ద్వారా ఓడిపోయిన సోదరుడికి అకాడమీలో చేరడానికి మద్దతు ఇవ్వాలి.

వారు ఆదివారం ఉదయం చర్చికి వెళ్లి వచ్చిన తర్వాత ఒక నాణెం ఎగరవేశారు. మొదటి కుమారుడు ఆల్బర్వాట్ టాస్ గెలిచి నూరేంబర్గ్ వెళ్లాడు. రెండవ కుమారుడు, ఆల్బర్ట్ ప్రమాదకరమైన గనులలోకి వెళ్లి, తరువాతి నాలుగు సంవత్సరాలు, అకాడమీలో చేరిన అతని సోదరుడికి ఆర్థిక సహాయం చేశాడు.

ఆల్బర్వాట్ సమర్థత అకాడమీలో ఒక సంచలనాన్ని సృష్టించింది. కళాఖండాలు సృష్టించటంలో ఆల్బర్వాట్ నైపుణ్యత, సృజనాత్మకత, పనితనం, ప్రొఫెసర్ల పనితనం కంటే చాలా మెరుగ్గా ఉండేవి. గ్రాడ్యుయేట్ అయ్యే సమయానికి, తాను చేసిన కళాఖండాలకు గణనీయమైన డబ్బు సంపాదించడం ప్రారంభించాడు.

ఆ యువ కళాకారుడు తన గ్రామానికి తిరిగి వచ్చినప్పుడు, ఆల్బర్వాట్ విజయవంతంగా స్వదేశానికి వచ్చినందుకు డ్యూరర్ కుటుంబం వారి పచ్చికబయలులో ఒక విందును ఏర్పాటు చేసింది. సంగీతం, నవ్వులతో కూడిన విలాసవంతమైన, చిరస్మరణీయమైన భోజనం తర్వాత, ఆల్బర్వాట్, తన ఆశయాన్ని నెరవేర్చడానికి ఆల్బర్ట్ చేసిన కృషి, త్యాగానికి తన ప్రియమైన సోదరుడికి కృతజ్ఞతలు తెలిపాడు.

ఆపై అతను అకాడమీలో తన సోదరుడి చదువుల కోసం ఖర్చు చేయడానికి తన హృదయపూర్వక ప్రతిపాదనను సమర్పించాడు. అతను ఇలా చెప్పాడు, " ఆల్బర్ట్, నా ప్రియా సోదరా, ఇప్పుడు నీ వంతు. ఇప్పుడు నీవు నీ కలను సాకారం చేసుకోవడానికి నూరేంబర్గ్ వెళ్లవచ్చు, నీకు కావలసినవన్నీ నేను జాగ్రత్తగా చూసుకుంటాను".

టేబుల్ చివరన కూర్చున్న ఆల్బర్ట్ వైపు అందరు ఆత్రుతతో చూశారు, అతని పాలిపోయిన ముఖం మీద కన్నీళ్లు ధారలుగా కారుతున్నాయి, అతను ఏడుస్తూ, క్రిందకి తలదించి అటూ ఇటూ ఊపుతూ, పదే పదే, "లేదు...వద్దు...వద్దు...వద్దు ",అన్నాడు.

చివరికి, ఆల్బర్ట్ లేచి తన చెంపల నుండి కారుతున్న కన్నీళ్లు తుడుచుకుని, అక్కడ ఉన్న తన కుటుంబ సభ్యుల వైపు చూసాడు, ఆపై, తన చేతులను తన కుడి చెంపకు దగ్గర పెట్టి, మెల్లగా ఇలా అన్నాడు, "లేదు, సోదరా, నేను నూరేంబర్గ్ వెళ్లలేను. దానికి చాలా ఆలస్యం అయిపోయింది....

గనుల్లో నాలుగేళ్లుగా పని చేయడం వలన నా చేతులు ఎలా అయిపోయాయో అందరూ చూడండి!

ప్రతి వేలులోని ఎముకలు కనీసం ఒక్కసారైనా విరిగి మళ్ళీ అతుక్కున్నవే, ఈ మధ్యనే నా కుడిచేతిలో తీవ్రమైన కీళ్ళనొప్పితో బాధపడుతున్నాను, కనీసం గ్లాసు కూడా పట్టుకోలేకపోతున్నాను, ఇంక కాన్వాస్ పై పెన్ను లేదా బ్రష్ తో సున్నితమైన, మృదువైన గీతలను ఎలా గీయగలను?

కాబట్టి, లేదు సోదరా, నాకు చాలా ఆలస్యమైపోయింది" అన్నాడు. 450 సంవత్సరాలకు పైగా గడిచిపోయాయి. ఇప్పటికీ, ఆల్బర్వాట్ డ్యూరర్ యొక్క వందలాది అద్భుతమైన పోర్ట్రెయిట్ లు, పెన్, సిల్వర్ పాయింట్ స్కెచ్ లు, వాటర్ కలర్లు, బొగ్గులు, చెక్కనగిషీలూ, రాగి నగిషీలు ప్రపంచంలోని ప్రతీ గొప్ప మ్యూజియంలో వ్రేలాడుతూ కనిపిస్తాయి.

కానీ అసమాన్యమైన విషయం ఏమిటంటే, చాలా మంది వ్యక్తుల మాదిరిగానే మీకు కూడా ఆల్బర్వాట్ డ్యూరర్ సృష్టించిన కళాఖండాలలో ఒకదానితో మాత్రం ఖచ్చితంగా పరిచయం ఉండిఉంటుంది. మీ ఇల్లు లేదా కార్యాలయంలో దాని యొక్క ప్రతిరూపం వ్రేలాడుతూ ఉండవచ్చు. ఆల్బర్ట్ చేసిన గొప్ప త్యాగానికి నివాళులర్పించేందుకు, ఆల్బర్వాట్ డ్యూరర్, కఠినమైన శ్రమకు, కష్టానికి గురైన తన సోదరుని నమస్కరిస్తున్న అరచేతులను, ఆకాశానికి చాచి ఉన్న సన్నని వేళ్లు ఉన్న చేతులను గీశాడు. అతను గీసిన ఆ ప్రభావవంతమైన డ్రాయింగ్ కు "చేతులు" అన్న శీర్షిక పెట్టాడు, కాని ప్రపంచం మొత్తం, వారి హృదయాలను తాకిన ఆ గొప్ప కళాఖండానికి, అతని ప్రేమ నివాళికి "ది ప్రేయింగ్ హ్యాండ్స్" ( ప్రార్థించే చేతులు ) అని పేరు పెట్టింది. హృదయానికి హత్తుకునే ఏ కళాఖండానైనా మీరు ఈ సారి చూసినప్పుడు, దానిని ఎవరూ ఒంటరిగా సృష్టించలేదని గుర్తు చేసుకోండి. దయగల హృదయం ముందు ఇతరులకు ప్రాముఖ్యతనిస్తుంది. పూర్తిగా అపరిచితులతో కలిగే అసౌకర్యం లేదా త్యాగం గురించి ఆలోచించదు, ఎందుకంటే ఇతరులకు సహాయం చేయడం అనేది దాని యొక్క సహజ స్వభావానికి అనుగుణంగా ఉంటుంది కాబట్టి.

**దాజీజీ**
**హార్ట్ ఫుల్ నెస్ ధ్యానం**
**అనువాదబృందం ఆంధ్రప్రదేశ్**


# శూన్యత్వమే సర్వస్వము : సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి


### డాక్టర్ సునీత ముక్తి మార్గం హెచ్ఎఫ్ఎన్



Shri.S.Krishna Reddy
REGIONAL DIRECTOR, EDUCATIONAL CELL, A.P&TS







**కడప పెన్ పవర్ ఆగస్టు 6 :** మనము నిద్ర లేచినప్పుడు ఉదయాన్నే కళ్ళు తెరవడానికి మనలో చాలామందికి ఇబ్బందిగా అనిపిస్తుంది.మెలకువగా ఉన్నా కళ్ళు తెరవలేని మనలో చాలామందికి ఇది ఆచరణాత్మక సమస్య.అందుకే వాళ్ళు మళ్ళీ నిద్రలోకి జారుకుంటారు. అందుకే వేదాలలో " ఉత్తిష్ఠ ,జాగృత" అనే ప్రముఖ సూక్తి ఉంది.దీని అర్థం " నిద్ర మేలుకో ,పైకి లే" అని.నిద్రలేవడం మేల్కొనడం కాదు." మరో మూడవస్థితి కూడా ఉంది.మీరు మేల్కొని ఉండి కూడా చుట్టూ ఈలోకంలో ఏమి జరుగుతూ ఉందో కూడా ఎంతమాత్రం తెలియనిస్థితిలో ఉండవచ్చు" అని గురుదేవులు చెపుతుండేవారు. మానవులందరూ యాంత్రికంగా పనిచేస్తున్నవారే.మరమనుషుల్లా నడవడం ,తినడం, నిద్రపోవడం ,మానవజీవితంలో ఈపనులు యాంత్రికంగా చేస్తూ ఉంటారు.బొమ్మలనాడించేవాని చేతిలో నాట్యం చేసే బొమ్మల్లా ఆడుతుంటారు." ఈ ప్రపంచమే ఒక నాటకరంగం. స్త్రీపురుషులందరూ కేవలం నటులు మాత్రమే.

**పురుషసూక్తం:**

దివ్యత్వము హృదయంలోనే నివాసం ఉంటుంది కావున, హృదయాన్ని తెరవకుండా ,ఏదీ సాధ్యం కాదని నా గురుదేవులు బోధించారు.పురుషసూక్తం చదవండి.హృదయంలో ఒక సూక్ష్మమైన జ్వాల ఉంటుందనీ,దానిలోనే మనము చెప్పుకునే పరమాత్మ నామరూపగుణరహితుడైన అనంత దివ్యత్వం ఉంటాడని అంటారు.నామరహితుడైనా అన్ని పేర్లూ ఆపరమాత్మ నుండే ఉద్భవించాయి.ఏరూపమూ లేకపోయినా ,ఈవిశ్వం లోని రూపాలన్నీ దానినుండే పుట్టుకొస్తాయి.ఏశక్తీ లేకపోయినా ఈ విశ్వంలోని అపారశక్తి అంతా ఆ పరమాత్మ నుండే వెలువడుతుంది.ఇది బృహదారణ్యకోపనిషత్తు లో యాజ్ఞవల్క్యుడు తన శిష్యునికి చెప్పిన కథతో పోలి ఉంటుంది.ఈ కథలో ఆయన తన శిష్యుడిని ఒక మర్రిపండుతెచ్చి దానిని కోసి చూడమంటాడు.అతనికి దానిలో చిన్నచిన్న విత్తనాలు కనబడతాయి.గురువు చెప్పినట్లుగా ఆవిత్తనం కూడా మధ్యకు కోసి చూస్తాడు." దానిలో ఏముంది? ఏమిలేదు " అని ఆ శిష్యుడు అంటాడు." ఈ ఏమీలేని"దాని (నథింగ్ నెస్)నుండే ఈపెద్దచెట్టు పుట్టుకొచ్చింది " .పరమాత్మ అని పిలిచే ఈ ఏమీ లేనిదాని నుండే ఈ విశ్వమంతా ఆవిర్భవించింది.

సేకరణ. కన్హ శాంతి వనం బ్రదర్స్ అండ్ సిస్టర్స్ అభ్యసిల బృందం.

## ఏళ్ల విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేయించండి : జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా



**కర్నూలు, పెన్ పవర్ ఆగస్టు 6 :** ఆగస్టు 12 వ తేదీన జిల్లాలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అధ్యక్షతన జాతీయ నులిపురుగుల నిర్మూలనపై అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నులిపురుగుల నివారణకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలోని స్కూల్ పిల్లలు మరియు కాలేజీ విద్యార్థులకు నులి పురుగుల నివారణ ఆవశ్యకత గురించి పూర్తి అవగాహన కల్పించి 1-19 సంవత్సరాల వారికి ఆల్బెండజోల్ మాత్రలు అందించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న విద్యార్థులకు ఈ మాత్రలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్వో శాంతికళ మాట్లాడుతూ... ఆల్బెండజోల్ 400 మిల్లి గ్రాముల మాత్రను భోజనం తర్వాత తీసుకునే విధంగా సూచించాలని కోరారు. చిన్న పిల్లలకు 1-2 సంవత్సరాల వయసు వారికి సగం టాబ్లెట్ అనగా 200 మిల్లీగ్రామ్స్ మాత్రను పొడిచేసి నీటి తో త్రాగించాలని కోరారు. చిన్నపిల్లలు 3-9 సంవత్సరాల వారు నమిలి చప్పరించి తీసుకునే విధంగా తెలపాలని కోరారు. టాబ్లెట్ ఇస్తున్నప్పుడు ఎక్స్పైరీ డేట్ చెక్ చేసుకోవాలని అధికారులకు తెలియజేశారు. ఏవైనా సమస్యలు వస్తే పిల్లల ను వెంటనే ఆస్పత్రులకు తరలించాలని కోరారు. ఆల్బెండజోల్ మాత్ర తో రక్తహీనత, పోషకాల లోపం అరికట్టబడుతుందని, చదువుపై ఏకాగ్రత, పనిచేయగల సామర్థ్యం పెరుగుతుందన్న విషయం పిల్లలకు, తల్లిదండ్రులకు తెలియ పరచాలని కోరారు. ఆగస్టు 12వ తారీకున మాత్ర తీసుకోలేకపోయిన వారు ఆగస్టు 20 మాప్ అప్ రోజున తప్పక తీసుకొన వలసిందిగా కోరారు. బడికి, కాలేజీకి వెళ్ళని పిల్లలు అంగన్వాడి కేంద్రాల నుండి మాత్రలను తీసుకొని అక్కడే ఉండి వినియోగించుకోవాలని కోరారు. ఎవరికి ఇంటికి తీసుకుని వెళ్లడానికి మాత్రలను ఇవ్వరాదని కోరారు. ఈ సమావేశంలో ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డిఆర్ఓ వెంకటనారాయణమ్మ, కర్నూలు ఆర్డిఓ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్డిఓ భరత్ నాయక్, డిప్యూటీ డిఎం హెచ్ ఓ భాస్కర్, అధికారులు పాల్గొన్నారు.

# మనోబంధుఫౌండేషన్... రాయలసీమలో స్పెషల్ డ్రైవ్..




### భూపతి రాజు రామకృష్ణ మరాజు

**కడప. పెన్ పవర్ ఆగస్టు 6 :** మన బంధు సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇటీవల విజయవాడలో జరిగిన నాలుగవ వార్షికోత్సవంలో మనోబంధు సేవ ఫౌండేషన్ జాతీయ ట్రస్టీ భూపతి రాజు రామకృష్ణ మరాజు విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు నెలలో మానసిక అనారోగ్య రోగులను గుర్తించి వారికి మెరుగైన చికిత్సలు అందించి తిరిగి వారి కుటుంబ సభ్యులకు వారిని దరి చేర్చడమే మనోబంధు సేవా ఫౌండేషన్ ముఖ్య ఉద్దేశ్యమని, ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ కన్వీనర్ సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి విజయవాడలో మాట్లాడుతూ ఆగస్టు నెలలో ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ రాయలసీమ లో ఉంటుందని అలాగే పలు స్వచ్ఛంద సేవా సంస్థలైన అనూష కారుణ్య ఫౌండేషన్, లక్ష్మీ ప్రసన్న స్నేహం ఫౌండేషన్, డాక్టర్ శ్రీనివాసులు , నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో కడప టౌన్ లో స్పెషల్ డ్రైవ్ చేపడతామని తెలియజేశారు. కడప, నంద్యాల, కర్నూల్, అనంతపురం, ధర్మవరం, శ్రీ సత్యసాయి జిల్లా, లోని పలు స్వచ్ఛంద సేవా సంస్థలు, పోలీస్ విభాగం వారు, మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బంది, తదితరులు సహకారంతో ఈ కార్యక్రమాలను చేపడతామని , డాక్టర్ ఎన్టీఆర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ రాధికా రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు 250 మందిని మానసిక అనారోగ్య రోగులను గుర్తించి , వారిని కుటుంబ సభ్యులతో కలపడం జరిగినది. ఎంతో సంతోషంగా , మరియు బాధ్యతాయుతంగా అంకితభావంతో సేవలందించడం, పూర్వజన్మ సుకృతంగా భావించి, ఇటువంటి మంచి సేవ కార్యక్రమాలను



అందించే సేవ భాగ్యము భారతదేశంలోనే మొట్టమొదటి అతిపెద్ద మన బంద్ సేవా ఫౌండేషన్ అని డాక్టర్ రాధికా రెడ్డి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉన్నతాధికారులైన రిటైర్డ్ ఐఏఎస్, అధికారులు, మన బంధు సేవా ట్రస్టీలు, విద్యార్థినీ విద్యార్థులు, పలు స్వచ్ఛంద సేవ నిర్వాహకులు, పాల్గొనడం జరిగినది. అందులో భాగంగా ఐదవ తేదీ మనోబంధు ఫౌండేషన్ కడప వారి ఆధ్వర్యంలో మానసిక అనారోగ్య వ్యక్తులకు హెయిర్ కటింగ్ అనూష టీం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మన బంధు, కారుణ్య కమిటీ సభ్యులు మాబు, శ్రీనివాసులు, మొదలైన వారు ఈ కార్యక్రమంలో పాల్గొనడం , ఎంతో సంతోషంగా ఉన్నదని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ అనూష తెలియజేశారు.








# కాళేశ్వరం కుస్తీ.... ఎవరికి లాభం?



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాజకీయాలను కుదిపేస్తున్న కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారం.. ఎవరికి మేలు చేస్తుంది? ఎవరికి మైనస్ అవుతుంది?. ఇదీ.. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న చర్చ. అవినీతిని ఎవరూ సహించరు. పైగా నిజంగానే ప్రజాధనం వృథా అయితే.. ఎవరు మాత్రం చర్యలు తీసుకోకుండా ఉండమని చెబుతారు? సో.. ఈ కోణంలో ఆలోచన చేస్తే.. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం చెబుతున్న ప్రకారం..చర్యలు తీసుకోవాల్సిందే. కానీ, ఇక్కడే తటపటాయింపు చోటు చేసుకుంది. ఏ కార్యక్రమం చేపట్టినా.. కొంత నిధులు వృథా అవుతాయి. వాటికి కారణాలు కూడా ఉంటాయి. అంతే తప్ప.. ప్రధాన ప్రాజెక్టే అవినీతి అంటే.. మాత్రం ప్రభుత్వానికి ఇబ్బంది. వాస్తవానికి ఇదే ఇప్పుడు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్‌కు కలిసి వస్తున్న అంశం. తమను ఉద్దేశ పూర్వకంగానే వేధిస్తున్నారని.. కేసీఆర్‌పై కక్షసాధింపు కోసమే ఇలా చేస్తున్నారన్న వాదన బలంగా ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తున్నా రు. నిజానికి తెలంగాణ సాధన తర్వాత.. కట్టిన అతిపెద్ద ఏకైక ప్రాజెక్టు కాళేశ్వరం. దీని నుంచి 2 లక్షల ఎకరాలకు పైగానే సాగు భూమికి నీరు అందుతుంది. అలానే 132 గ్రామాలకు తాగునీరు కూడా అందుతుంది. దీనిని ఎవరూ వ్యతిరేకించడం లేదు. ప్రభుత్వం కూడా.. దీనిపై ఆచితూచి వ్యవహరిస్తోంది. అసలు ప్రాజెక్టే తప్పని ప్రభుత్వం కూడా చెప్పడం లేదు. కానీ, అవినీతి జరిగిందని అంటున్నారు. ఈ అవినీతిని నిరూపించి.. కేసీఆర్ పై చర్యలు తీసుకునే విషయంలో అధికార పార్టీలోనే విబేదాలు పొడచూపుతుండడం ఇప్పుడు చర్చకు దారితీస్తోంది. కాటగారికల్‌గా.. కేసీఆర్ తప్పులు ఎత్తి చూపించినా.. ఆయనపై చర్యలు తీసుకునే విషయంలో కేసీఆర్ ఉన్న ఇమేజ్.. ప్రజల్లో నెలకొన్న సెంటిమెంటు వంటివి అడ్డువస్తున్నాయన్నది కీలక నాయకులు చెబుతున్న మాట.

ఒకవేళ.. ప్రభుత్వమే.. కనుక కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ రిపోర్టును అడ్డు పెట్టుకుని కేసీఆర్‌ను అరెస్టు చేయదలిస్తే... దీనిని ఆయన మాత్రం ఎందుకు తేలికగా తీసుకుంటారు?. సీరియస్‌గానే వ్యవహరిస్తారు. ఈ క్రమంలోనే బిగ్ ప్లాన్ దిశగా కేసీఆర్ అడుగులు వేస్తున్నారు. ప్రజల మధ్య ఉండేందుకు ఆయన ప్రణాళికలు చేస్తున్నారు. తద్వారా తన అరెస్టే అనివార్యమైతే.. అది ఇంట్లో కాదు.. ప్రజల మధ్యే జరగాలన్నది ఆయన వ్యూహం. తద్వారా.. తెలంగాణ సాధకుడినే అరెస్టు చేశారన్న సెంటిమెంటును ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాలని ప్రయత్నిస్తున్నారు. సో.. ఈ నేపథ్యంలో కాళేశ్వరం కుస్తీ వ్యవహారం.. కాంగ్రెస్ కంటే కూడా.. బీఆర్ఎస్‌కు లాభించేలా చేసుకునే ప్రతిపాదన అయితే.. తెరమీదికి వస్తోంది. మరి ఏం జరుగుతుందో చూడాలి.

# కూల్చుతామన్న 'ఫాంహౌజ్' నుంచే బీఆర్ఎస్ ను చీల్చుతున్న బీజేపీ



**హైదరాబాద్ పెన్ పవర్:** మానసిక ప్రశాంతత, రాజకీయ రణగొణ ధ్వనులకు దూరంగా అధినేత కేసీఆర్ అత్యధిక సమయం గడిపే ఫాంహౌజ్ కారణంగా బీఆర్ఎస్ ను ప్రత్యర్థి పార్టీలు తరచూ విమర్శిస్తుంటాయి. ఫాంహౌజ్ పార్టీ అని కూడా ఎద్దేవా చేస్తుంటాయి. సరిగ్గా మూడేళ్ల కిందట మరో ఫాంహౌజ్ తెలంగాణ రాజకీయాల్లో కలకలం రేపింది. అదే హైదరాబాద్ శివారులోని మొయినాబాద్ ఫాంహౌజ్. బీఆర్ఎస్ కు చెందిన నలుగురు ఎమ్మెల్యేలకు రూ.వందకోట్లు, కాంట్రాక్టులు ఎరవేసి వారిని బీజేపీలోకి చేర్చుకునేందుకు ప్రయత్నం జరిగిందని బీఆర్ఎస్ ఆరోపించింది. దీనిపై అధినేత కేసీఆర్ కు ముందే ఉప్పందడంతో మొయినాబాద్ ఫాంహౌస్ కుట్రను భగ్నం చేశామని చెప్పుకొచ్చింది. ఇది జరిగింది 2022 నవంబరులో వచ్చిన మునుగోడు ఉప ఎన్నికకు ముందు.

**ఆ ఎమ్మెల్యేలను వెంటేసుకుని..**

ఎమ్మెల్యేల కొనుగోలు వ్యవహారాన్ని బీఆర్ఎస్ మునుగోడు ఉప ఎన్నికల్లో బలంగా ఉపయోగించుకుంది. బీజేపీ వల విసిరిన ఎమ్మెల్యేలు (గువ్వల బాలరాజు–అచ్చంపేట, పైలట్ రోహిత్ రెడ్డి–తాండూరు, బీరం హర్షవర్ధన్ రెడ్డి–కొల్లాపూర్, రేగా కాంతారావు–పినపాక) ను కేసీఆర్ తన వెంట ప్రచారంలో తిప్పారు. మీడియా సమావేశంలోనూ వారిని చూపించారు. రూ.వంద కోట్లకూ తలగ్గొని తమ ఎమ్మెల్యేలు అంటూ గొప్పగా చెప్పారు. ఇదంతా ఫలించి మునుగోడు ఉప ఎన్నికలో బీఆర్ఎస్ పది వేల ఓట్లతో గెలుపొందింది.

**నాడు బీజేపీకి దెబ్బ**

మునుగోడు ఎమ్మెల్యేగా ఉన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ కు రాజీనామా చేసి 2022లో బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగారు. బలమైన నాయకుడు అయిన ఆయనను ఓడించడం కష్టమే అనే అభిప్రాయం ఏర్పడింది. మునుగోడులో బీజేపీ జెండా ఎగరడం ఖాయం అని అందరూ భావించారు. కానీ, చివర్లో ఎమ్మెల్యేల కొనుగోలుకు బీజేపీ ప్రయత్నం చేసిందంటూ కేసీఆర్ బ్రహ్మాస్త్రాన్ని బయటకు తీసి విజయం సొంతం చేసుకున్నారు.

**ఇప్పుడు అక్కడి నుంచే మొదలు..**

తెలంగాణలో అధికారం అనే కలను సాకారం చేసుకునే దిశలో... మునుగోడు ఉప ఎన్నికలో గెలుపు అత్యంత అవసరం అని బీజేపీ భావించింది. కానీ, ఆ ఓటమితో అంతా మారిపోయింది. సరిగ్గా ఏడాది తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వెనుకబడిపోయింది. మునుగోడులో ఓటమి, అసెంబ్లీ ఎన్నికల్లో వెనుకబాటుకు పరోక్ష కారణం.. మొయినాబాద్ ఫాంహౌజ్ అంశమేనని కమలనాథుల భావన. అందుకనే అక్కడినుంచే నరుక్కొచ్చే పని చేస్తోంది. ఇందులో భాగంగానే తాజాగా అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజును ఆపరేషన్ ఆకర్ష్ లో తమవైపు తిప్పుకొంది. మొయినాబాద్ ఫాంహౌజ్ ఘటనలో ఉన్న మరో ఎమ్మెల్యే కూడా తర్వలో బీజేపీలో చేరతారని చెబుతున్నారు. అంటే.. ఎక్కడైతే పోగొట్టుకున్నామో అక్కడే మళ్లీ వెదుక్కోవడం అన్నమాట. నాడు కేసీఆర్ ఈ అంశాన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లి.. నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని పడగొడతామని ప్రకటనలు చేశారు.

**నాడు నేడు బీఎల్ సంతోష్...**

బీఎల్ సంతోష్.. కర్ణాటకకు చెందిన బీజేపీ అగ్రనేత. జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత). బీజేపీలో మోస్ట్ పవర్ ఫుల్. అలాంటి బీఎల్ సంతోష్‌ను ఎమ్మెల్యేల కొనుగోలు కేసులో బీఆర్ఎస్ ప్రధాన పాత్రధారిగా పేర్కొంది. ఆయన అరెస్టుకు సైతం ప్రయత్నాలు సాగించింది. ఇప్పుడు అదే బీఎల్ సంతోష్.. నాటి మొయినాబాద్ ఫాంహౌజ్ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. గువ్వలతో పాటు మరో మాజీ ఎమ్మెల్యే ఆయనను కలుసుకోవడమే దీనికి నిదర్శనం.

# అమరావతికి రాజముద్ర.... శుభవార్త అప్పుడేనా ?



**హైదరాబాద్ పెన్ పవర్:** అమరావతి రాజధాని. ఇది అందరికీ తెలుసు. ఏపీ వారికి ఇంకా బాగా తెలుసు. ఎందుకంటే రోజూ అదే విషయం మీద అంతా మాట్లాడుకుంటారు కాబట్టి. అయితే అమరావతిని రాజధాని అని అనుకుంటే సరిపోదు కదా. దానికి చట్టబద్ధత అవసరం కదా అన్న చర్చ అయితే ఉంది. అమరావతిని రాజధానిగా చేసుకుంటూ ఇప్పటికి పదకొండేళ్ల క్రితం అక్కడ శంకుస్థాపనలు చేశారు. అక్టోబర్ 22న జరిగిన ఆ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ హాజరై శ్రీకారం చుట్టారు. ఇక మరోసారి తాజాగా అమరావతి పునర్ నిర్మాణ పనులకు కూడా నరేంద్ర మోడీ వచ్చారు. అయితే ఈ పదకొండేళ్ళ మధ్యలో అమరావతి రాజధానికి చట్టబద్ధత అయితే రాలేదు. ఎందుకు రాలేదు అంటే...

**గెజిట్ నోటిఫికేషన్ లో :**

ఒక రాష్ట్రానికి ఫలానా నగరం లేదా ప్రాంతం అతి ముఖ్య పట్టణం అని కేంద్రం గుర్తించాలి. ఆ ముఖ్యపట్టణం రాజధానిగా అవుతుంది. పాలనాపరంగా అక్కడ నుంచే అంతా జరుగుతుంది. అలా దేశంలో ప్రతీ రాష్ట్రానికీ రాజధానిని కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ ద్వారా గుర్తించింది. కానీ ఏపీలో అమరావతికి మాత్రం ఆ గుర్తింపు అయితే ఇప్పటిదాకా లేదు. దశాబ్దం పైగా జరిగిపోతున్నా అమరావతి ఒక రాజధానిగా అధికారిక గుర్తింపుని పొందలేకపోయింది.

**డబుల్ ఇంజన్ సర్కార్ అయినా :**

కేంద్రంలో ఎన్డీయే ఉంది. రాష్ట్రంలో కూడా ఎన్డీయే ప్రభుత్వం ఉంది. ఇలా రెండు ప్రభుత్వాలూ ఒక్కటే ట్యూన్ తో సాగుతున్నాయి. అక్కడ టీడీపీ మంత్రులు ఉంటే ఇక్కడ ప్రభుత్వంలో బీజేపీ మంత్రి ఉన్నారు. అయినా ఏపీకి రాజధాని హోదా అన్నది అధికారికంగా దఖలు పడలేదు. ఇలా ఎందుకు జరుగుతోంది అన్నదే చర్చగా ఉంది. ఈ రోజున చూస్తే కేంద్రంలో నరేంద్ర మోడీ నాయకత్వంలోని ఎన్డీయే ప్రభుత్వానికి ఏపీలోని టీడీపీ ఎంపీలే ఆక్సిజన్ గా ఉన్నారు. మరి అమరావతి ఏపీకి రాజధాని అన్న గెజిట్ నోటిఫికేషన్ రావడానికి ఎక్కడ ఏ స్థాయిలో ఆలస్యం అవుతోంది అన్నదే చర్చగా ఉంది.

**మూడు ముక్కలాట అందువల్లనే :**

ఏపీకి అధికారిక ముద్రతో రాజధాని అన్నది లేకపోవడం వల్లనే వైసీపీ ప్రభుత్వ హయాంలో మూడు ముక్కలాట సాగింది అని అంతా అంటున్నారు. ప్రత్యేకించి రాజధాని అంటే ఫలానాది అని చెప్పుకునే వీలు లేకుండా పోయింది అని అంటున్నారు. ఇపుడు చూస్తే అమరావతి రాజధాని అన్నది ఏపీలోని అయిదు కోట్ల మంది ప్రజానీకం ముక్తకంఠంతో ఆమోదిస్తున్నారు. 94 శాతం స్ట్రైక్ రేట్ తో కూటమికి సీట్లను ఓట్లను జనాలు కట్టబెట్టారు. ఏపీకి రాజధాని ఒక సెంటిమెంట్ గా మారింది. ఇక అమరావతి రాజధాని నిర్మాణానికి కూటమి ప్రభుత్వం గత ఏడాదిగా చురుకుగా పనిచేస్తోంది. ఈ నేపథ్యంలో రాజ ముద్ర మీద ఇంకా ప్రకటన రాకపోవడం మీదనే అంతా ఆలోచిస్తున్నారు.

**రైతుల మదిలో మాట :**

తాజాగా అమరావతి రైతులను కలసి మాట్లాడినపుడు కూడా వారు అమరావతికి రాజధానిగా అధికార ముద్ర ఉండాలని కోరారు. గెజిట్ నోటిఫికేషన్ తొందరగా రావాలని వారు బలంగా కోరుకుంటున్నారు. రెండవ విడత భూసేకరణకు తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని అమరావతిని ఏపీకి శాశ్వత రాజధానిగా అధికారికంగా గుర్తించాలని అంటున్నారు. ఇది ఎంత తొందరగా ప్రక్రియ సాగితే అంత మంచింది అని కూడా చెబుతున్నారు.

**బీజేపీ నుంచి భరోసా :**

ఏపీ బీజేపీ ప్రెసిడెంట్ గా నియమితులైన పీవీఎన్ మాధవ్ జిల్లా పర్యటనలు చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన గుంటూరు పర్యటన నేపథ్యంలో అమరావతి రైతులు కలిశారు. వారు తన మనసులో మాటను ఆయనకు చెప్పారు. ఈ క్రమంలో పీవీఎన్ మాధవ్ వారికి హామీ ఇచ్చారు. అమరావతికి రాజముద్ర దక్కేలా చూస్తామని అన్నారు. గెజిట్ నోటిఫికేషన్ ద్వారా అమరావతికి అధికార ముద్ర పడేలా చూస్తామని ఆయన భరోసా ఇచ్చారు. మొత్తం మీద తొందరలోనే అమరావతికి రాజముద్ర పడుతుందని అంతా ఆశిస్తున్నారు. అది కనుక జరిగితే అమరావతి ఏపీకి శాశ్వత రాజధానిగా పక్కా అధికార ముద్రతో ఉంటుంది అని అంటున్నారు.

# గేమింగ్ యాప్ ప్రమోషన్ వివాదంపై హీరో విజయ్ దేవరకొండ స్పందన



**హైదరాబాద్ పెన్ పవర్:** టాలీవుడ్ యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ ఇటీవల బెట్టింగ్ యాప్ ప్రమోషన్ ఆరోపణలపై తన మీద వచ్చిన విమర్శలకు గట్టిగా స్పందించారు. %ూ%23 అనే గేమింగ్ యాప్‌కు మాత్రమే తాను ప్రచారం చేశానని, అది పూర్తిగా చట్టబద్ధమైన యాప్ అని ఆయన స్పష్టం చేశారు. గేమింగ్ యాప్‌లు, బెట్టింగ్ యాప్‌లు ఒకటే కాదని, రెండూ వేర్వేరు అని ప్రజలు అర్థం చేసుకోవాలని ఆయన కోరారు.

**ఈడీ విచారణకు పూర్తి సహకారం**

ఇటీవల ఈడీ (ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్) విచారణకు హాజరైన సందర్భంగా ఆయన తన బ్యాంక్ లావాదేవీలు, తీసుకున్న మొత్తం, కాంట్రాక్టు వివరాలు వంటి అన్ని పత్రాలను సమర్పించారు. "నేను ఎప్పుడూ చట్టానికి లోబడి ఉండే సంస్థలకే ప్రమోషన్ చేశాను. తెలంగాణలో %ూ%23 యాప్ అందుబాటులో కూడా లేదు. నేను తీసుకున్న డబ్బులు కాంట్రాక్టు ఆధారంగానే తీసుకున్నాను. ఈ వివరాలన్నీ ఈడీకి ఇచ్చాను" అని విజయ్ వివరించారు.

**మీడియాపై ఆగ్రహం**

కొన్ని మీడియా ఛానెళ్లు తనను బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నట్టుగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విజయ్ దేవరకొండ ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ప్రమోట్ చేసింది గేమింగ్ యాప్ మాత్రమే.

దాన్ని బెట్టింగ్ యాప్‌గా చూపించడం అన్యాయం. ఆ మీడియా సంస్థలు వెంటనే తమ వార్తలను తొలగించాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

ఈ వివాదంపై విజయ్ దేవరకొండ మాట్లాడుతూ తాను చట్టాన్ని గౌరవించే వ్యక్తిని అని, తనపై వస్తున్న తప్పుడు ప్రచారాలు ఆపాలని కోరారు. నిజాలు ప్రజల ముందుకు రావాలని, న్యాయబద్ధంగా, పారదర్శకంగా పనిచేసేవారు ఎల్లప్పుడూ నిలబడతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

# వీసా ఆలస్యం.. విద్యార్థులకు ఆశగా మారిన అమెరికా చదువు!




**హైదరాబాద్ పెన్ పవర్:** సాధారణంగా చాలామంది విద్యార్థులు అమెరికాలో చదవాలని ఎన్నో కలలు కంటూ ఉంటారు. అందుకు దిశగా అడుగులు వేస్తారు కూడా.. అయితే ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితులను చూస్తుంటే.. ఎందుకు అమెరికాలో విద్యను ఎంచుకున్నాము అని విద్యార్థులు కూడా తలలు పట్టుకుంటున్నారు. ఉన్నత విద్య కోసం అమెరికాలోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో అడ్మిషన్ తీసుకున్న అంతర్జాతీయ విద్యార్థులు.. ఇప్పుడు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అసలు విషయంలోకి వెళ్తే.. తాజాగా ఏర్పడిన సరికొత్త నిబంధనల వల్ల వారికి వీసాల జారీలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంది. ఇప్పటికే విద్యా సంవత్సరం ప్రారంభమైనా .. తాము తరగతులకు వెళ్లకపోతుండడంతో పలువురు విద్యార్థులు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి వీసా అపాయింట్మెంట్ నిలిపివేతను జూన్ మధ్యలోనే తొలగించినా.. నెల రోజులు దాటుతున్నా.. ఈ ప్రక్రియ ఇంకా వేగవంతం కాలేదు. దీంతో వేల మంది విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రభావం ఇటు విద్యార్థులపైనే కాదు అమెరికా విద్యా వ్యవస్థపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపిస్తోంది. అక్కడి విశ్వవిద్యాలయాల బడ్జెట్లు, ఉన్నత విద్యా కేంద్రం.. అమెరికా ఇమేజ్ ని కూడా దెబ్బతీస్తోందని చెప్పవచ్చు.

ఇప్పటికే దక్షిణ కాలిఫోర్నియాలోని ఫుర్మాన్ యూనివర్సిటీలో ఈ ఏడాది కేవలం 562 మంది మాత్రమే కొత్త విద్యార్థులు తమ పేరును నమోదు చేసుకున్నారు. గత ఏడాది 613 మంది నమోదు కాగా.. వీసా కారణంగానే ఇప్పుడు విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోయిందని చెప్పవచ్చు.అటు అమెరికాలోని హరిజోనా స్టేట్ యూనివర్సిటీలో కూడా దాదాపు 1,000 మంది అంతర్జాతీయ విద్యార్థులకు వీసాలు రాలేదు. ఈ విషయాన్ని ఈ యూనివర్సిటీ ప్రెసిడెంట్ మైఖేల్ క్రో వెల్లడించారు.ముఖ్యంగా భారత్ – చైనా విద్యార్థులకు వీసా మంజూరులో ఏడు రెట్ల వ్యత్యాసం ఉన్నట్లు ఒక టాప్ యూనివర్సిటీ అధికారి కూడా వెల్లడించారు. కేవలం 100 మంది వరకు అంతర్జాతీయ విద్యార్థులు నమోదు చేసుకునే చిన్న కాలేజీలపై కూడా ఇప్పుడు ఈ ప్రభావం భారీగా పడుతోంది.ఇకపోతే వీసా రాక ఇబ్బందులు పడుతూ.. సకాలంలో తరగతులకు హాజరుకాలేని వారికోసం కొన్ని విద్యాసంస్థలు కూడా ప్రత్యామ్నాయాలను వెతుకుతున్నాయి. అటు అరిజోనా యూనివర్సిటీ ఇలా వీసా రాక ఇబ్బంది పడుతున్న విద్యార్థుల కోసం లండన్ లో క్యాంపస్ నిర్వహిస్తోంది. యూఎస్ నార్త్ ఈస్టర్ విశ్వవిద్యాలయం రిమోట్ లర్నింగ్ ఆప్షన్ ను అందుబాటులోకి తీసుకొచ్చింది. హార్వర్డ్ కెన్నడీ స్కూల్ కూడా తాత్కాలికంగా తమ విద్యార్థులకు సరైన విద్యను అందించడానికి యూనివర్సిటీ ఆఫ్ టొరంటో లోని ముంక్స్ స్కూల్లో అవకాశం కల్పించేలా పరిశీలనలు చేస్తోంది. ఇలా వీసాల ఆలస్యంతో అంతర్జాతీయ విద్యార్థులు సరైన సమయంలో విద్యను అందుకోవడంలో వెనుకడుగు పడుతోందని చెప్పవచ్చు. అటు విద్యార్థులకు సమయం వృథా.. ఇటు యూనివర్సిటీలపై ఆర్థిక భారం కూడా పెరగనుంది. ఇకపోతే ట్రంప్ కార్యవర్గం చర్యలతో ఉన్నత విద్యకు బలమైన కేంద్రంగా ఉన్న అమెరికా ఇప్పుడు ఆ స్థానం కోల్పోయేలా కనిపిస్తోందని.. వీసా కారణంగా అమెరికా వెళ్లలేని ఎంతోమంది విద్యార్థులు కెనడా, ఆస్ట్రేలియా, యూకే యూనివర్సిటీలో చేరుతున్నట్లు సమాచారం. మొత్తానికైతే అక్కడ నిర్ణయాలు అక్కడ ఆర్థిక వ్యవస్థ పైనే ప్రభావం చూపుతున్నాయని మరి కొంతమంది హెచ్చరిస్తున్నారు . మరి దీనిపై అటు ప్రభుత్వాలు ఎలాంటి నిర్ణయం తీసుకుంటాయో చూడాలి.

# రోహిత్, కోహ్లీలకు బీసీసీఐ బిగ్ షాక్.. 2027 వరల్డ్ కప్‌కు యంగ్ టీమిండియా



**హైదరాబాద్ పెన్ పవర్:** టీమిండియా స్టార్ క్రికెటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ప్రస్తుతం వన్డే క్రికెట్ లో మాత్రమే కొనసాగుతున్నారు. టీ20, టెస్ట్ కెరీర్ కు రిటైర్మెంట్ ప్రకటించిన రోకో జోడీ వన్డే క్రికెట్ లో మాత్రమే కొనసాగడానికి కారణం లేకపోలేదు. సౌతాఫ్రికా వేదికగా 2027లో జరగనున్న వన్డే వరల్డ్ కప్ ఆడాలని రోహిత్, కోహ్లీ నిర్ణయించుకున్నారు. వన్డే వరల్డ్ కప్ ఆడడంపై వీరు అనేక సందర్భాల్లో తమ ఆసక్తిని తెలిపారు. అయితే వీరికి బీసీసీఐ ఊహించని షాక్ ఇవ్వనుంది. 2027 వన్డే వరల్డ్ కప్ కోసం ఇప్పటి నుంచే కుర్రాళ్లను సిద్ధం చేయనున్నట్టు సమాచారం. వరల్డ్ కప్ కు మరో రెండున్నరేళ్ల సమయం ఉంది. ప్రస్తుతం రోహిత్, కోహ్లీ వన్డే ఫార్మాట్ మాత్రమే ఆడడంతో వారి ఫామ్ ఆందోళన కలిగిస్తుంది. వీరిద్దరూ ఆ సమయానికి ఫిట్ నెస్ తో పాటు ఫామ్ లో ఉంటారంటే ఖచ్చితంగా చెప్పాలని పరిస్థితి. టెస్ట్ క్రికెట్ లో పేలవ ఫామ్ కారణంగానే ఈ ఇద్దరూ సుదీర్ఘ ఫార్మాట్ కు రిటైర్మెంట్ ప్రకటించారు. ఒక్క ఫార్మాట్ ఆడడంతో వీరి ఫామ్ ప్రస్నార్ధకంగా మారింది. బీసీసీఐ కూడా రోహిత్, కోహ్లీ జోడీ ఖచ్చితంగా జట్టులో ఉంటారనే గ్యారంటీ ఇవ్వలేకపోతుంది. ఈ ఇద్దరు దిగ్గజ క్రికెటర్లు లేకపోయినా ఇటీవలే ఇంగ్లాండ్ తో జరిగిన టెస్ట్ సిరీస్ ను టీమిండియా అద్భుతంగా ఆడి 2-2 తో సమం చేసుకుంది. రోహిత్ శర్మను తప్పించి గిల్ కు వన్డే కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించాలని బీసీసీఐ భావిస్తోంది. దానికి తగ్గట్టుగా ప్రణాళికలు రచిస్తోంది. ప్రస్తుతం రోహిత్ వయసు 38 కాగా కోహ్లీ వయసు 36. ఈ ఇద్దరూ తిరిగి జట్టులోకి రావడం ఖాయం. ఈ ఏడాది అక్టోబర్‌లో ఆస్ట్రేలియాలో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ ఆడతారు. ఆ తర్వాత నవంబర్-డిసెంబర్‌లో దక్షిణాఫ్రికాతో స్వదేశంలో సిరీస్ ఆడతారు. అయితే 2027 వన్డే వరల్డ్ కప్ కు మాత్రం వీరు ఆడడం అనిశ్చితిగానే ఉంది. 2023 వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో ఆస్ట్రేలియా చేతిలో టీమిండియా ఓడిపోయింది. ఈ ఓటమి భారత జట్టుకు బిగ్ హార్ట్ బ్రేక్ అనే చెప్పాలి.

# బుమ్రా గురించి నెగటివ్‌గా మాట్లాడొద్దు.. నెటిజన్స్‌కు సచిన్ రిక్వెస్ట్



**హైదరాబాద్ పెన్ పవర్:** బుమ్రా భారత టెస్ట్ జట్టులో ఉంటే మన జట్టు గెలవడం కంటే ఎక్కువగా ఓడిపోతుంది. ఇటీవలే ముగిసిన ఇంగ్లాండ్ సిరీస్ లోనే కాదు బుమ్రా కెరీర్ ప్రారంభం నుంచి ఈ బ్యాడ్ సెంటి మెంట్ కొనసాగుతూనే వస్తుంది. 2018లో బుమ్రా అరంగేట్రం చేసినప్పటి నుండి బుమ్రా ఆడని 28 టెస్ట్ మ్యాచ్‌ల్లో ఇండియా ఐదు మాత్రమే ఓడిపోయింది. 20 మ్యాచ్‌ల్లో విజయం సాధించగా.. మరో మూడు డ్రాగా ముగిశాయి. దీంతో ఇప్పుడు బుమ్రాపై సరదాగా సోషల్ మీడియాలో ట్రోలింగ్ సాగుతోంది. ఈ సమయంలో క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్.. బుమ్రా గురించి తన ఆలోచనలను షేర్ చేసుకున్నాడు. బుమ్రా గురించి సచిన్ మాట్లాడుతూ.. "జనాలు ఏం మాట్లాడుకుంటున్నారో నాకు తెలుసు. బుమ్రా లేకుండా భారత జట్టు రెండు టెస్టులు గెలిచింది. జనాలు దీన్ని నెగటివ్ కోణంలో చూడకండి. నిజం చెప్పాలంటే ఇది కేవలం యాదృచ్చికం మాత్రమే". అని సచిన్ రెడ్డిట్ వీడియోలో అన్నారు. ఈ సందర్భంగా బుమ్రా ప్రదర్శన గురించి సచిన్ స్పందించాడు. "బుమ్రా చాలా బాగా ఆడాడు. మొదటి టెస్ట్‌లో ఐదు వికెట్లు పడగొట్టాడు. అతను రెండవ మ్యాచ్ ఆడలేదు. కానీ లార్డ్స్‌లో జరిగిన మరోసారి అతను 5 వికెట్లు పడగొట్టాడు. అతను ఆడిన 3 టెస్ట్‌లలో రెండుసార్లు ఐదు వికెట్లు పడగొట్టాడు. చాలా క్వాలిటీ బౌలర్. నేను అతన్ని అగ్రస్థానంలో ఉంచుతాను". అని టెండూల్కర్ చెప్పుకొచ్చాడు.

ఇంగ్లాండ్ తో జరిగిన 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ లో బుమ్రా ఆడని మ్యాచ్ ల్లో భారత జట్టు టెస్టుల్లో అద్భుత విజయాలను సాధిస్తూ వచ్చింది. తాజాగా ఇంగ్లాండ్ తో ముగిసిన 5 మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను ఇండియా 2-2 తో సిరీస్ సమం చేసింది. ఇండియా గెలిచిన రెండు టెస్టుల్లో బుమ్రా లేకపోవడం విశేషం. బుమ్రా ఆడిన మూడు టెస్టుల్లో రెండు మ్యాచ్ ల్లో ఓడిపోగా.. ఒక మ్యాచ్ డ్రా అయింది. అంతకముందు బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో బుమ్రా 5 టెస్ట్ మ్యాచ్ లాడితే టీమిండియా కేవలం ఒక మ్యాచ్ లోనే గెలిచింది.

# ఐసీసీ టెస్ట్ ర్యాంకింగ్స్.. సిరాజ్, ప్రసిద్ కృష్ణలకు కెరీర్ అత్యుత్తమ ర్యాంకులు



**హైదరాబాద్ పెన్ పవర్:** ఓవల్ వేదికగా ఇంగ్లాండ్ తో జరిగిన ఐదో టెస్టులో టీమిండియా ఫాస్ట్ బౌలర్లు మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ కృష్ణలు అదరగొట్టిన సంగతి తెలిసిందే. ఐదో టెస్టులో ఇద్దరూ కలిసి 17 వికెట్లు పడగొట్టి టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించారు. తొలి ఇన్నింగ్స్ లో సిరాజ్, ప్రసిద్ చెరో నాలుగు వికెట్లు పడగొట్టారు. రెండో ఇన్నింగ్స్ లో సిరాజ్ ఐదు వికెట్లు పడగొట్టగా.. ప్రసిద్ నాలుగు వికెట్లు తమ ఖాతాలో వేసుకున్నాడు. ఈ టెస్ట్ విజయంతో ఐదు మ్యాచ్ ల టెస్ట్ సిరీస్ ను టీమిండియా 2-2 తో సిరీస్ సమం చేసింది. ఈ సిరీస్ తర్వాత సిరాజ్, ప్రసిద్ ర్యాంక్ లు మెరుగయ్యాయి. బుధవారం (ఆగస్ట్ 6) ఐసీసీ టెస్ట్ ర్యాంక్ లను రిలీజ్ చేసింది. సిరాజ్ 674 అత్యుత్తమ రేటింగ్‌లతో ఏకంగా 12 స్థానాలు ఎగబాకి 15వ స్థానంలో నిలిచాడు. ఈ మ్యాచ్ కు ముందు 27 వ స్థానంలో ఉన్న సిరాజ్ ఒక్కసారిగా టాప్ -15లోకి చేరుకోవడం విశేషం. 386 రేటింగ్ పాయింట్లతో 84 వ స్థానంలో ఉన్న ప్రసిద్ ఏకంగా 25 స్థానాలు ఎగబాకి 59 వ స్థానానికి చేరుకున్నాడు. ఈ సిరీస్ కు ముందు 94 వ స్థానంలో ఉన్న ప్రసిద్ సిరీస్ ముగిశాక టాప్ 60 లోకి రావడం విశేషం. జస్ప్రీత్ బుమ్రా టాప్ ర్యాంక్ లో కొనసాగుతున్నాడు. రబడా రెండో ర్యాంక్ లో ఉన్నాడు.

**జైస్వాల్ మళ్ళీ టాప్ 5 లోకి జైశ్వాల్:**

బ్యాటింగ్ విషయానికొస్తే, ఓవల్‌లో సెంచరీతో సత్తా చాటిన యశస్వి జైస్వాల్ ఐసీసీ టెస్ట్ బ్యాటింగ్ ర్యాంకింగ్‌లో మూడు స్థానాలు ఎగబాకి టాప్-5లో తిరిగి స్థానం సంపాదించాడు. మరోవైపు చివరి టెస్టులో విఫలమైన టీమిండియా కెప్టెన్ శుభమాన్ గిల్ నాలుగు స్థానాలు దిగజారి 13 వ ర్యాంక్ కు పడిపోయాడు. ఇంగ్లాండ్ స్టార్ బ్యాటర్ జో రూట్ 908 రేటింగ్ పాయింట్స్ తో అగ్ర స్థానంలో కొనసాగుతున్నాడు. ఓవల్ టెస్టుకు ముందు మూడో ర్యాంక్ లో ఉన్న హ్యారీ బ్రూక్ సెంచరీతో ఒక స్థానం ఎగబాకి రెండో ర్యాంక్ కు చేరుకున్నాడు. రిషబ్ పంత్ 8 వ ర్యాంక్ లో కొనసాగుతున్నాడు.

# ఫ్లాపులతో కొట్టుమిట్టాడుతున్న మృణాల్.. బుట్ట సర్దాల్సిందేనా?

హిందీ టీవీ సీరియల్ నటిగా కెరియర్ ఆరంభించి, ఆ తర్వాత నటిగా గుర్తింపు సొంతం చేసుకుంది మృణాల్ ఠాకూర్. తెలుగులో హను రాఘవపూడి దర్శకత్వంలో.. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నేరుగా తెలుగులో నటించిన తొలి చిత్రం సీతారామం. ఈ సినిమాలో సీత పాత్రలో చాలా అద్భుతంగా ఒదిగిపోయి నటించింది మృణాల్ ఠాకూర్. తెలుగులో మొదటి సినిమానే అయినా.. ఆ సినిమాలోని పాత్రతో తెలుగువారి హృదయాలను దోచుకుంది. పైగా తెలుగు ఆడియన్స్ ఈమెను ఓన్ చేసుకున్నారు. తర్వాత నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన హాయ్ నాన్న సినిమాలో కూడా నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన ది ఫ్యామిలీ స్టార్ సినిమాలో కూడా కథానాయికగా నటించింది కానీ ఈ సినిమా పెద్దగా వర్కౌట్ కాలేదు. ఇక ఈ సినిమా తర్వాత ఈమెకు తెలుగులో అవకాశాలు రాలేదు. పైగా దాదాపు ఐదు సంవత్సరాల సినీ కెరియర్లో రెండు చిత్రాలు తప్ప మరో సినిమా ఈమెకు విజయాన్ని అందించలేదు. అటు కథానాయికగా ఎదిగిన బాలీవుడ్ లో కూడా వరుసగా ఎదురు దెబ్బలు తగులుతూనే వచ్చాయి. 2019లో హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ 30 సినిమాతో మంచి బ్రేక్ అందుకున్న ఈమె.. ఆ తర్వాత ఒక్క సినిమాతో కూడా సక్సెస్ అందుకోలేకపోయింది. సూపర్ 30 తరువాత బాలీవుడ్ లో తూఫాన్, బాట్లా హౌస్, జెర్సీ, సెల్ఫీ, గుమ్రా, ఆంఖ్ మిచోలి, పిప్పా ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ వరుస పరాజయాలే పలకరించాయి. ఇక ఇప్పుడు సన్నాఫ్ సర్దార్ 2లో కూడా నటించింది. అజయ్ దేవగన్ హీరోగా నటించిన ఈ సినిమా కూడా గత శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు ప్రీ రిలీజ్ బజ్ పెద్దగా లేకపోవడం వల్ల ఓపెనింగ్స్ రాలేదు. టికెట్ పై 50% ఆఫర్ పెట్టినా కూడా తొలిరోజు థియేటర్లలో జనం కనిపించకపోవడం, పైగా డివైడ్ టాక్ రావడంతో కలెక్షన్లు కూడా సాధించలేకపోయింది. దాంతో వారంలోపే డిజాస్టర్ మూవీగా తేలిపోయింది ఈ సినిమా. ప్రస్తుతం ఈమె ఆశలన్నీ అడివి శేష్ హీరోగా నటిస్తున్న డెకాయిట్ సినిమాపైనే ఉన్నాయి. సాధారణంగా అడివి శేష్ సినిమాలు అంటే మంచి కంటెంట్ తో వస్తాయని అందరికీ తెలిసిందే. ఇప్పటికే ఆయన నుంచి వచ్చిన గూఢచారి , హిట్ 2 వంటి చిత్రాలు భారీ విజయాన్ని సొంతం చేసుకున్నాయి. ఇప్పుడు డెకాయిట్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. మొదట ఈ సినిమాలో శృతిహాసన్ కథానాయికగా ఎంపిక అయ్యి.. కొంత భాగం షూటింగ్ కూడా పూర్తి చేశారు. కాకపోతే శృతిహాసన్ వరుస సినిమాల బిజీ షెడ్యూల్స్ కారణంగా ఈ సినిమాకి డేట్ కేటాయించలేకపోయింది. ఫలితంగా సినిమా నుండీ తప్పుకుందని అడివి శేషు ఒక ఇంటర్వ్యూలో తెలియజేశారు. ఇప్పుడు ఆ ఛాన్స్ మృణాల్ ఠాకూర్ కి వచ్చింది. మరి ఈ సినిమాతో నైనా కం బ్యాక్ ఇస్తుందా? ఒకవేళ ఈ సినిమా బెడిసి కొడితే ఇక బుట్ట సర్దాల్సిందేనా ? అనే అనుమానాలు కూడా ఫిలిం ఇండస్ట్రీలో వినిపిస్తున్నాయి. మరి ఈ ఒక్క సినిమాపై ఆశలు పెట్టుకున్న మృణాల్ కి ఎలాంటి ఫలితం లభిస్తుందో చూడాలి.





డియోర్ షూస్ మరియు హౌస్ ఆఫ్ CB డ్రెస్‌లో అదితి బుధతోకి అభిమానులను ఆశ్చర్యపరిచింది



షామా దక్షిణ ఫ్రాన్స్‌లో ఆకర్షణీయమైన జీవితాన్ని గడుపుతోంది

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com